తెలుగు దినపత్రిక

# సిరి

People's Voice వార్త పత్రిక

RNI TG TEL/ 26/A0381

19-05-2026

మంగళవారం హైదరాబాద్

సంపుటి: (volume): 1

సంచిక: (ISSUE): 104

PUBLISHED FROM HYDERABAD పేజీలు-8 వెల:రూ.4 /–



తెలుగు దినపత్రిక

www.siridaily.com

సిరి People's Voice వార్తపత్రిక

RNI:TGTEL/26/A0381

siridailynews@gmail.com

/siridailynews

@siridailynews

epaper.siridaily.com

విలేకరులు కావలెను

ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్ తో పాటు, అన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.

99897 78881, 7702344303, 9440451575


## త్వరలో హైదరాబాద్

# మెట్రో రద్దీకి చెక్..

- ఇక ప్రయాణం సుఖమయం... హైదరాబాద్ మెట్రోకు 60 కొత్త కోచ్‌లు
- ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు ప్రభుత్వ కీలక నిర్ణయం
- బెంగళూరు బీఈఎంఎల్‌తో ఒప్పందానికి రంగం సిద్ధం
- పెరగనున్న రైళ్ల ఫ్రీక్వెన్సీతో ప్రయాణికులకు ఊరట

**హైదరాబాద్, మే 18 సిరిన్యూస్ :** హైదరాబాద్ నగరంలో మెట్రో ప్రయాణికులకు త్వరలోనే పెద్ద ఊరట లభించనుంది. నిత్యం ప్రయాణికుల రద్దీతో కిక్కిరిసిపోతున్న మెట్రో రైళ్లలో ఇబ్బందులకు చెక్ పెట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సుమారు 60 కొత్త కోచ్‌లను కొనుగోలు చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందుకు అవసరమైన ప్రక్రియను వేగవంతం చేసింది. బెంగళూరుకు చెందిన ప్రభుత్వ రంగ సంస్థ భారత్ ఎర్త్ మూవర్స్ లిమిటెడ్ (బీఈఎంఎల్) నుంచి ఈ కోచ్‌లను కొనుగోలు చేయనున్నారు. ఈ వారంలోనే హైదరాబాద్ మెట్రో రైల్ సంస్థ, బీఈఎంఎల్ మధ్య అధికారిక ఒప్పందం కుదిరే అవకాశం ఉంది. ప్రస్తుతం హైదరాబాద్‌లోని మూడు కారిడార్లలో మొత్తం 56 రైళ్లు

మిగతా 4వ పేజీలో..





## సరస్వతి అంత్య పుష్కరాలకు

# గవర్నర్‌కు ఆహ్వానం

- లోక్ భవన్‌లో గవర్నర్‌ను కలిసిన కొండా సురేఖ
- మే 21 నుంచి జూన్ 1 వరకు పుష్కరాలు
- ఎండోమెంట్స్ అధికారులతో కలిసి మర్యాదపూర్వక భేటీ

2



2

## సాంకేతికతతో విపత్తు

# రక్షణ వ్యవస్థ బలోపేతం

- భారీ విపత్తు నిర్వహణ మాక్ డ్రిల్ ప్రారంభించిన పొంగులేటి



# నో ఫ్రెండ్లీ..

# ఇక స్ట్రాంగ్ పోలీసింగే!

అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం..
సామాన్యుడికి రక్షణ
తెలంగాణ ఖాకీ నయా రూట్
ఫ్రెండ్లీ పోలీసింగ్ నినాదంతో
దెబ్బతిన్న ఖాకీల ఆత్మస్థైర్యం
క్షేత్రస్థాయిలో పెరిగిన నేరాలు
శాంతిభద్రతల పరిరక్షణే పరమావధి
నూతన డీజీపీ సీవీ ఆనంద్ 'ఎఫెక్టివ్' మంత్రం
పోలీస్ బాస్ ప్రకటనతో
మొదలైన ఆసక్తికర చర్చ
పోలీసు శాఖలో సరికొత్త జోష్

గతంలో ఉన్న డీజీపీలు, పాలకులు సమాజానికి 'ఫ్రెండ్లీ పోలీసింగ్' అంటూ ఒక కొత్త నినాదాన్ని పరిచయం చేశారు. అయితే, ఆ నినాదం క్షేత్రస్థాయికి వెళ్లేసరికి దాని అసలు ఉద్దేశం పక్కదారి పట్టిందనే విమర్శలు బలంగా వచ్చాయి. 'ఫ్రెండ్లీ' అనే ముసుగును ఆసరాగా చేసుకుని అసాంఘిక శక్తులు, నేరగాళ్లు రెచ్చిపోతుంటే.. పోలీసులు మాత్రం చేతులు కట్టేసుకుని చూస్తూ ఉండిపోవాల్సి వచ్చిందనే ఆవేదన డిపార్ట్‌మెంట్‌లో ఉండిపోయింది.




**ప్రత్యేక ప్రతినిధి, సిరి న్యూస్:** తెలంగాణ పోలీస్ శాఖలో ఒక సరికొత్త శకానికి నాంది పడబోతోంది. గత కొంతకాలంగా రాష్ట్రంలో నడుస్తున్న సంప్రదాయ పోలీసింగ్ పంథాకు భిన్నంగా, భవిష్యత్తులో ఖాకీల వైఖరి ఎలా ఉండబోతోందనే విషయాలపై

మిగతా 2వ పేజీలో..



2

## 20 నుంచి టీఆర్ఎస్

# జెండా పండుగ

- పార్టీ చీఫ్ కవిత
- పార్టీ జెండా గద్దె మోడల్ ఆవిష్కరణ

# కేరళ సీఎంకు కోమటిరెడ్డి శుభాకాంక్షలు

- నూతన మంత్రివర్గానికీ అభినందనలు
- ప్రజల విశ్వాసానికి నిదర్శనమని వ్యాఖ్య
- సమగ్ర పాలన అందించాలని ఆకాంక్ష

**హైదరాబాద్, మే 18 సిరిన్యూస్:** కేరళ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వీడీ సతీశన్‌కు రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి శుభాకాంక్షలు

మిగతా 2వ పేజీలో..






# జహీరాబాద్‌లో పర్యాటక వారోత్సవాల ప్రారంభం

- ఎస్ఐహెచ్‌ఎంకు ఐదు కోట్ల మంజూరు ప్రకటన
- కొత్త కోర్సులు, ప్రవేశాలకు మంత్రి శ్రీకారం
- యువత ఉపాధిపై ప్రత్యేక దృష్టి

2



2

## అప్పుల పేరుతో

# పిలిచి హత్యలు!

- మొయినాబాద్ జంట మర్డర్ కేసులో షాకింగ్ ట్విస్ట్
- అప్పు ఇచ్చిన 8 మందిని టార్గెట్ చేసిన కరీమాబేగం దంపతులు

## కేబీఆర్ ఫ్లైఓవర్‌పై

# సుప్రీంకోర్టు ఆదేశాలు

చెట్ల తొలగింపుపై తాత్కాలిక నిలుపుదల
పర్యావరణ పరిరక్షణపై కీలక వ్యాఖ్యలు
జూలై ఇరవై ఏడుకు విచారణ వాయిదా



**న్యూఢిల్లీ, మే 18 సిరిన్యూస్** హైదరాబాద్‌లోని కేబీఆర్ పార్కు సమీపంలో ప్రతిపాదిత ఫ్లైఓవర్ నిర్మాణానికి సంబంధించి సుప్రీంకోర్టులో కీలక విచారణ జరిగింది. తదుపరి విచారణ జరిగే వరకు చెట్లను నరికివేయవద్దని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. పర్యావరణపరంగా సున్నిత ప్రాంతాల్లో నిర్మాణ పనులు చేపట్టేటప్పుడు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని కోర్టు సూచించింది. విచారణ

మిగతా 4వ పేజీలో..



# తెలంగాణకు చల్లటి కబురు

3

- నేడు, రేపు పలు జిల్లాల్లో వర్షాలు
- ఉపరితల ఆవర్తన ప్రభావంతో వాతావరణ మార్పులు
- ఎల్లుండి నుంచి మళ్లీ పెరగనున్న ఎండల తీవ్రత

# జహీరాబాద్‌లో పర్యాటక వారోత్సవాల ప్రారంభం

**జహీరాబాద్, మే 18 సిరిన్యూస్**

'ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక'లో భాగంగా జహీరాబాద్‌లోని స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ సంస్థలో పర్యాటక వారోత్సవాలను మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సీ కార్పొరేషన్ సహకారంతో కొత్తగా ప్రవేశపెట్టిన బేకరీ, కన్ఫెక్షనరీ కోర్సులను ప్రారంభించడంతో పాటు కొత్త విద్యా సంవత్సరానికి సంబంధించిన బీబీఏ, ఎంబీఏ కోర్సుల ప్రవేశాలను కూడా లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా పర్యాటక శాఖ రూపొందించిన 'టూరిస్ట్ గైడ్' పోస్టర్‌ను కూడా మంత్రి ఆవిష్కరించారు. సుదీర్ఘకాలంగా నిరుపయోగంగా ఉన్న ఎస్ఐహెచ్ఎంను తిరిగి ప్రారంభించడం సంతోషకరమని ఆయన పేర్కొన్నారు. విద్య, ఉపాధి అవకాశాల కల్పనలో ఈ సంస్థ కీలక పాత్ర పోషించబోతోందని తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి జూపల్లి కృష్ణారావు ఎస్ఐహెచ్ఎంను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేసేందుకు ఐదు కోట్ల రూపాయలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. గ్రామీణ ప్రాంత యువతలో వృత్తి నైపుణ్యాలను పెంపొందించి స్వయం ఉపాధి దిశగా వారిని ప్రోత్సహించడమే ప్రభుత్వ లక్ష్యమని వివరించారు.

గ్రామీణ ప్రాంతాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. సంస్థలో చేరిన పేద విద్యార్థులపై ఆర్థిక భారం పడకుండా వారికి స్టైఫండ్ అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వెల్లడించారు. సాంకేతిక పరిజ్ఞానం ప్రపంచాన్ని దగ్గర చేసిందని, ప్రైవేట్ రంగంలో ప్రస్తుతం అపారమైన అవకాశాలు ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. యువత పర్యాటక, ఆతిథ్య రంగాలపై ప్రత్యేక దృష్టి సారించి తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు.

విద్యార్థులు కేవలం కోర్సులతోనే పరిమితం కాకుండా భాషా నైపుణ్యాలను కూడా అభివృద్ధి చేసుకోవాలని మంత్రి సూచించారు. విదేశీ భాషలు నేర్చుకోవడం ద్వారా అంతర్జాతీయ స్థాయిలో అవకాశాలు పెరుగుతాయని, పిల్లల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు కూడా వారిని ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు.

# సరస్వతి అంత్య పుష్కరాలకు గవర్నర్‌కు ఆహ్వానం

**హైదరాబాద్, మే 18 సిరిన్యూస్:**

పర్యావరణ, అటవీ శాఖలతో పాటు దేవాదాయ శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న కొండా సురేఖ సోమవారం లోక్ భవన్‌లో గవర్నర్ శివప్రతాప్ శుక్లాను మర్యాదపూర్వకంగా కలిశారు. రానున్న సరస్వతి అంత్య పుష్కరాలకు హాజరుకావాలని ఆమె గవర్నర్‌ను ఆహ్వానించారు. మే 21 నుంచి జూన్ 1, 2026 వరకు నిర్వహించనున్న సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా గవర్నర్‌కు అధికారిక ఆహ్వానం అందజేశారు. పుష్కరాల నిర్వహణకు ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేపడుతున్నట్లు ఈ సందర్భంగా వివరించారు. మంత్రి కొండా సురేఖతో పాటు దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, శాఖ కమిషనర్ హనుమంతరావు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. పుష్కరాల ప్రాధాన్యం, నిర్వహణ ఏర్పాట్లపై వారు గవర్నర్‌కు వివరించినట్లు సమాచారం. సరస్వతి అంత్య పుష్కరాలు భక్తులకు ఆధ్యాత్మికంగా ఎంతో ప్రాముఖ్యత కలిగిన వేడుకగా భావిస్తారని అధికారులు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. పుష్కరాల సమయంలో లక్షలాది మంది భక్తులు పాల్గొనే అవకాశం ఉన్నందున భద్రత, రవాణా, తాగునీరు, వైద్య సేవలు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు వెల్లడించారు. గవర్నర్‌తో జరిగిన ఈ భేటీ సానుకూల వాతావరణంలో సాగింది. పుష్కరాల విజయవంత నిర్వహణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులు అభిప్రాయపడ్డారు.




# 20 నుంచి టీఆర్ఎస్ జెండా పండుగ

**తెలంగాణ బ్యూరో, మే 18 సిరిన్యూస్:**

రాష్ట్రవ్యాప్తంగా ఒకే మోడల్ లో తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) జెండా గద్దెలు నిర్మిస్తున్నామని పార్టీ చీఫ్ కవిత తెలిపారు. సోమవారం బంజారాహిల్స్ లోని టీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన స్టేట్ జనరల్ బాడీ సమావేశంలో జెండా గద్దెల మోడల్ ను ఆవిష్కరించారు.మూడు ఫీట్ల ఎత్తు, రెండు ఫీట్ల వెడల్పుతో పార్టీ జెండా గద్దెలు నిర్మించాలని సూచించారు. పార్టీ జెండా గద్దె బేస్ ఒక ఫీట్ ఎత్తులో ఉంటుందని పైభాగం మరో రెండు ఫీట్ల ఎత్తులో ఉంటుందని తెలిపారు. జెండా గద్దె బేస్ కు గ్రీన్ కలర్.. పై భాగంలో ఉండే జెండా గద్దె కు ఎల్లో కలర్, దాని మధ్యలో తెలంగాణ మ్యాప్ బ్లూ కలర్ లో ఏర్పాటు చేయాలని సూచించారు. తెలంగాణ మ్యాప్ మధ్యలో ఇంగ్లీష్ అక్షరాల్లో టీఆర్ఎస్ అని రాయాలని సూచించారు. జెండా గద్దె బేస్ గ్రీన్ కలర్ మధ్యలో తెలుగులో తెలంగాణ రక్షణ సేన అని రాయాలని సూచించారు. ,పార్టీ జెండా కలర్ కోడ్స్ కూడా తాము ఇచ్చిన విధంగానే చూసుకోవాలని.. అప్పుడే రాష్ట్ర వ్యాప్తంగా జెండాలన్నీ ఏకరూపంలో ఉంటాయని వెల్లడించారు. ఈనెల 20వ తేదీ నుంచి జూన్ 20 వరకు జెండా పండుగను నిర్వహించాలని పార్టీ శ్రేణులకు సూచించారు

# కేరళ సీఎంకు కోమటిరెడ్డి శుభాకాంక్షలు

**మొదటిపేజీ తరువాయి**



తెలిపారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన మంత్రివర్గ సభ్యులందరికీ అభినందనలు తెలియజేస్తూ సామాజిక మాధ్యమాల వేదికగా సందేశం విడుదల చేశారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ కేరళ ప్రజలు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పు ప్రజాస్వామ్య విలువలపై ఉన్న విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలు, ఆశయాలకు అనుగుణంగా కొత్త ప్రభుత్వం ముందుకు సాగాలని ఆకాంక్షించారు. యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్‌కు లభించిన ఈ విజయానికి ప్రజల విశ్వాసమే ప్రధాన కారణమని ఆయన అభిప్రాయపడ్డారు. సమగ్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చే దిశగా ప్రభుత్వం పనిచేయాలని సూచించారు. ప్రజాస్వామ్య, సమగ్ర భావజాలంతో ముందుకు వెళ్లాలన్న సంకల్పానికి ఈ విజయం ప్రతిబింబమని పేర్కొన్నారు. కొత్త ప్రభుత్వం ప్రజల అంచనాలను అందుకునేలా పాలన అందించాలని కోరారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో నూతన ప్రభుత్వం సమర్థవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా పాలన సాగించాలని సూచించారు. కేరళ కొత్త ప్రభుత్వం విజయవంతమైన పాలన అందించి రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లాలని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వం మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# నో ఫ్రెండ్లీ.. ఇక స్ట్రాంగ్ పోలీసింగే!

**మొదటిపేజీ తరువాయి**



నూతన డీజీపీ సీవీ ఆనంద్ ఇటీవల ఓ ప్రైవేట్ కార్యక్రమంలో ఇచ్చిన స్పష్టమైన సంకేతాలు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారాయి. గతంలో ఉన్న డీజీపీలు, పాలకులు సమాజానికి 'ఫ్రెండ్లీ పోలీసింగ్' అంటూ ఒక కొత్త నినాదాన్ని పరిచయం చేశారు. అయితే, ఆ నినాదం క్షేత్రస్థాయికి వెళ్లేసరికి దాని అసలు ఉద్దేశం పక్కదారి పట్టిందనే విమర్శలు బలంగా వచ్చాయి. 'ఫ్రెండ్లీ' అనే ముసుగును ఆసరాగా చేసుకుని అసాంఘిక శక్తులు, నేరగాళ్లు రెచ్చిపోతుంటే.. పోలీసులు మాత్రం చేతులు కట్టేసుకుని చూస్తూ ఉండిపోవాల్సి వచ్చిందనే ఆవేదన డిపార్ట్‌మెంట్‌లో ఉండిపోయింది. దీనివల్ల కాలక్రమేణా పోలీసు శాఖలోనే కొంతమంది సిబ్బంది ఆత్మస్థైర్యం తీవ్రంగా దెబ్బతిన్నదనేది బహిరంగ రహస్యం.

**పోలీసింగ్ కు సరికొత్త దారి**

ఈ నేపథ్యంలోనే బాధ్యతలు స్వీకరించిన కొత్త డీజీపీ సీవీ ఆనంద్, పాత పంథాకు స్వస్తి పలుకుతూ 'ఇక స్ట్రాంగ్ పోలీసింగే!' అంటూ కొత్త దారి చూపబోతున్నారు. ఆయన మాటలు కేవలం ఒక ప్రకటన మాత్రమే కాదు.. రానున్న రోజుల్లో తెలంగాణలో పోలీసింగ్ ఏ రేంజ్‌లో డిఫరెంట్‌గా ఉండబోతుందో చెప్పడానికి ఒక బలమైన సంకేతం. ఫ్రెండ్లీ పోలీసింగ్ అంటే నేరగాళ్లతో స్నేహం చేయడం కాదని.. సమాజంలో అలజడులు సృష్టించే ఆ ఐదు శాతం అసాంఘిక శక్తుల పట్ల అత్యంత కఠినంగా, సింహస్వప్నంగా వ్యవహరించడమేనని ఆయన తేల్చిచెప్పారు. ఈ ఒక్క వ్యాఖ్యతో తెలంగాణ రాష్ట్రంలో ఎలాంటి అసాంఘిక శక్తులనైనా సరే వదిలే ప్రసక్తే లేదని ఆయన ఇన్ డైరెక్ట్‌గా హెచ్చరించినట్లయింది. ఇదే ఇప్పుడు పోలీస్ బెటాలియన్ల నుంచి పోలీస్ స్టేషన్ల వరకు ప్రధాన చర్చనీయాంశంగా మారింది.

**గతంలో ఒకలా.. ఇకపై మరోలా!**

గత కొన్నేళ్లుగా తెలంగాణలో అమలైన పోలీసింగ్ విధానంపై డిపార్ట్‌మెంట్‌లోనే భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. 'ఫ్రెండ్లీ' పేరు చెప్పి చిన్నచిన్న నేరగాళ్లు, రౌడీషీటర్ల పట్ల కూడా పోలీసులు ఉదాసీనంగా వ్యవహరించాల్సి వచ్చేదనే వాదనలు ఉన్నాయి. లా అండ్ ఆర్డర్ విషయంలో కఠినమైన నిర్ణయాలు తీసుకోకపోవడం వల్ల శాంతిభద్రతలకు విఘాతం కలగడమే కాకుండా, ప్రజల్లో పోలీసులపై ఉన్న భయం, గౌరవం తగ్గుతూ వచ్చాయి. విధుల్లో ఉన్న పోలీసులపైనే దాడులు జరిగే స్థాయికి పరిస్థితులు దిగజారాయి. కానీ, రానున్న రోజుల్లో ఈ పరిస్థితులు పూర్తిగా తారుమారు కాబోతున్నాయనే సంకేతాలు లభించాయి. డీజీపీ వైఖరిని బట్టి చూస్తే, ఇకపై రౌడీయిజం, గుండాయిజం, భూదందాలు చేసేవారిపై ఉక్కుపాదం మోపడం ఖాయంగా కనిపిస్తోంది.

**అసాంఘిక శక్తులకు ఇన్‌డైరెక్ట్ వార్నింగ్**

రాష్ట్రంలో డ్రగ్స్ మహమ్మారి, గంజాయి సంస్కృతి విపరీతంగా పెరిగిపోతుండటం, సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతుండటంపై కొత్త డీజీపీ అత్యంత సీరియస్‌గా ఉన్నారు. విద్యాసంస్థల్లో డ్రగ్స్ ఆనవాళ్లు దొరికితే యాజమాన్యాలదే పూర్తి బాధ్యతని హెచ్చరించడం వెనుక ఉన్న ఉద్దేశం.. వ్యవస్థను ఎంత కఠినంగా మార్చబోతున్నారో అర్థం చేసుకోవచ్చు. అసాంఘిక శక్తులకు ఎక్కడా, ఎలాంటి పొలిటికల్ సపోర్ట్ ఉన్నా సరే చట్టం తన పని తాను చేసుకుపోతుందనే బలమైన మెసేజ్‌ను ఆయన డిపార్ట్‌మెంట్‌కు అందించారు. నేరగాళ్ల గుండెల్లో వణుకు పుట్టేలా 'స్ట్రాంగ్ పోలీసింగ్' అమలు చేస్తేనే సామాన్య ప్రజలకు నిజమైన రక్షణ దొరుకుతుందని, పోలీస్ స్టేషన్‌కు వచ్చే 95 శాతం సామాన్యుడికి గౌరవం దక్కుతుందని ఆయన నమ్ముతున్నారు.

**సిబ్బందిలో నూతనోత్సాహం..**

గతంలో ఫ్రెండ్లీ పోలీసింగ్ పేరుతో తమ ఆత్మస్థైర్యాన్ని కోల్పోయిన కిందిస్థాయి పోలీసు సిబ్బందికి డీజీపీ ప్రకటన ఒక కొత్త బూస్ట్‌లా పనిచేస్తోంది. చట్ట ప్రకారం, నిజాయితీగా విధులు నిర్వర్తించే ప్రతి హోంగార్డు, కానిస్టేబుల్ నుంచి ఎస్పీ వరకు అందరికీ తాను సంపూర్ణ అండగా నిలబడతానని డీజీపీ భరోసా ఇవ్వడం విశేషం. వీఐపీల ఒత్తిళ్లకు లొంగకుండా డ్యూటీ చేసే అధికారులను కాపాడుకుంటానని ఆయన చెప్పిన మాటలు పోలీసుల్లో ధైర్యాన్ని నింపాయి. ఒకవైపు పోలీసుల శారీరక, మానసిక ఆరోగ్యం కోసం 'ఫిట్ కాప్ యాప్' వంటి ఆధునిక సాంకేతికతను వాడుతూనే.. మరోవైపు విధుల్లో అలసత్వాన్ని వహించేవారికి, అవినీతికి పాల్పడేవారికి ఏసీబీ రూపంలో స్ట్రెయిట్ వార్నింగ్ ఇచ్చారు. మొత్తానికి, తెలంగాణలో రాబోయే రోజుల్లో పోలీసింగ్ వ్యవస్థ ఎంతో పటిష్టంగా, భిన్నంగా ఉండబోతోందన్న సంకేతాలు అటు నేరగాళ్లకు ముచ్చెమటలు పట్టిస్తుండగా, ఇటు సామాన్య ప్రజల్లో భద్రతా భావాన్ని రెట్టింపు చేస్తున్నాయి.

**డబ్బు కోసమైతే రావొద్దు.. పాన్ షాప్ పెట్టుకోండి!**

పోలీసు శాఖలోకి కొత్తగా వచ్చే యువతకు, ప్రస్తుత అధికారులకు డీజీపీ సీవీ ఆనంద్ విధుల్లో నిజాయితీపై అత్యంత ఘాటుగా స్పష్టమైన సందేశం ఇచ్చారు. ప్రజలకు సేవ చేయాలనే తపన, నిబద్ధత ఉన్నవారే ఈ శాఖలోకి రావాలి. అంతేకానీ, అధికారం చెలాయించడానికో, అక్రమంగా డబ్బు సంపాదించడానికో వస్తే ఏదో ఒక రోజు ఏసీబీ ట్రాప్‌లో పడటం, సస్పెండ్ కావడం ఖాయం అని స్ట్రెయిట్ వార్నింగ్ ఇచ్చారు. కేవలం డబ్బు సంపాదించాలనే ఆలోచన ఉన్నవారు పోలీస్ ఉద్యోగానికి రావడం కంటే, ఒక పాన్ షాపు పెట్టుకుంటే అంతకన్నా ఎక్కువే సంపాదించుకోవచ్చని, దయచేసి డిపార్ట్‌మెంట్‌కు వచ్చి ప్రభుత్వానికి, శాఖకు చెడ్డపేరు తేవద్దని హితవు పలికారు.

# అప్పుల పేరుతో పిలిచి హత్యలు!

- మొయినాబాద్ జంట మర్డర్ కేసులో షాకింగ్ ట్విస్ట్
- అప్పు ఇచ్చిన 8 మందిని టార్గెట్ చేసిన కరీమాబేగం దంపతులు
- ఇద్దరు మహిళలను చంపి ఫామ్‌హౌస్‌లోనే పాతిపెట్టిన నిందితులు
- మరో ఆరుగురిని కూడా రప్పించే ప్రయత్నం
- ప్రాణహాని ఉందంటూ పోలీసులను ఆశ్రయించిన మహిళలు
- విచారణలో ఫినాయిల్ తాగి ఆత్మహత్యాయత్నం చేసిన కరీమాబేగం



**హైదరాబాద్, మే18 సిరిన్యూస్:**

రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ జంట హత్యల కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. అప్పు ఇచ్చిన వారినే టార్గెట్ చేస్తూ కరీమాబేగం, ఆమె భర్త రెహమాన్ హత్యలకు ప్లాన్ చేసినట్లు పోలీసుల దర్యాప్తులో బయటపడింది. మొత్తం 8 మందిని చంపాలని కుట్ర పన్నిన నిందితులు.. అందులో ఇద్దరు మహిళలను ఇప్పటికే హత్య చేసినట్లు విచారణలో తేలింది.

తాండూరు ఇందిరమ్మ కాలనీలో నివసించే ఆబేదా బేగం, మహబూబాబీతో పాటు మరి కొందరు మహిళలు కరీమాబేగం దంపతులకు, వారి బంధువు నయీంకు అప్పుగా నగదు ఇచ్చారు. చాలా కాలంగా డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో బాధితులు ఒత్తిడి తీసుకు వస్తుండటంతో వారిని అంతమొందించాలని నిందితులు పథకం రచించినట్లు పోలీసులు గుర్తించారు.

ముందుగా అప్పు తిరిగి ఇస్తామని నమ్మించి మహబూబాబీని మొయినాబాద్ సమీపంలోని తోల్కట్ట ఫామ్‌హౌస్‌కు పిలిపించారు. అక్కడ గొంతు నులిమి హత్య చేసి శవాన్ని పూడ్చిపెట్టారు. అనంతరం ఆబేదా బేగంను కూడా అదే ప్రాంతానికి తీసుకెళ్లి హత్య చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది.

ఇద్దరు మహిళల హత్యల తర్వాత మరో ఆరుగురిని కూడా ఫామ్‌హౌస్‌కు రప్పించే ప్రయత్నం చేసినట్లు సమాచారం. అయితే వారు అక్కడికి వెళ్లకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. జంట హత్యల ఘటన వెలుగులోకి రావడంతో మిగిలిన మహిళలు అప్రమత్తమై తమకు కూడా ప్రమాదం ఉందంటూ పోలీసులను ఆశ్రయించారు.

ఈ కేసులో ప్రధాన నిందితురాలు కరీమాబేగంను అదుపులోకి తీసుకుని కరణ్‌కోట్ పోలీస్ స్టేషన్‌లో విచారిస్తున్న సమయంలో ఆమె ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బాత్రూమ్‌కు వెళ్లిన ఆమె ఫినాయిల్ తాగడంతో పోలీసులు వెంటనే హైదరాబాద్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. కేసులో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశముందని పోలీసులు భావిస్తున్నారు.

# గోవుల అక్రమ తరలింపును అడ్డుకోండి

- డీజీపీ కి రాజాసింగ్ లేఖ

**తెలంగాణ బ్యూరో, మే 18 సిరిన్యూస్**

రాష్ట్రంలో గోవులను అక్రమంగా తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే రాజాసింగ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్‌కు ఎమ్మెల్యే బహిరంగ లేఖ రాశారు. ఈ నెల 16న రాత్రి గోవులతో వెళ్తున్న లారీని గో రక్షక్ దళ్ కార్యకర్తలు అడ్డుకున్నారని.. దీంతో ఎంఐఎం ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ అక్కడకు చేరుకొని ఆ లారీని తీసుకెళ్లడం ఎంతవరకు కరెక్ట్ అని ప్రశ్నించారు. చట్టం అందరికీ ఒకేలా ఉండాలని.. హిందువైనా, ఎంఐఎం నాయకులైనా ఒకే విధంగా చూడాలని అన్నారు. గోవుల అక్రమ రవాణా చేస్తూ బహిరంగంగా తిరుగుతున్న వారిపై వెంటనే కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. పోలీసులు.. రాజకీయ ఒత్తిడికి లోను కాకుండా పని చేయాలని తెలిపారు. హిందువులపై మాత్రమే చర్యలు తీసుకుంటే ప్రజల్లో అనుమానాలు వస్తాయన్నారు. గోమాతను కాపాడాలని చెప్పే ప్రభుత్వం.. అక్రమ రవాణాను ఎందుకు ఆపడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారని తెలిపారు. ఎవరైనా చట్టం ఉల్లంఘిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. తెలంగాణ డీజీపీ వెంటనే ఈ విషయంపై స్పందించి చర్యలు తీసుకోవాలని రాజాసింగ్ లేఖలో స్పష్టం చేశారు.

# సాంకేతికతతో విపత్తు రక్షణ వ్యవస్థ బలోపేతం

- ప్రమాదాల సమయంలో 'గోల్డెన్ అవర్' కీలకం
- భారీ విపత్తు నిర్వహణ మాక్ డ్రిల్ ప్రారంభించిన మంత్రి పొంగులేటి

**హైదరాబాద్, మే 18 సిరిన్యూస్:**

ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజల ప్రాణాలను కాపాడడం, వీలైనంత వరకూ ఆస్తులకు నష్టం కలగకుండా చూడడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ప్రపంచస్థాయి సాంకేతికతతో విపత్తు రక్షణ వ్యవస్థను బలోపేతం చేస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న విపత్తు నిర్వహణ మాక్ ఎక్సర్‌సైజ్‌లలో భాగంగా హైదరాబాద్ నెక్లెస్ రోడ్ హెచ్ఎండీఏ గ్రౌండ్స్ వద్ద సోమవారం నిర్వహించిన మాక్ డ్రిల్‌ను మంత్రి పొంగులేటి సోమవారం ప్రారంభించారు. అనంతరం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో వివిధ శాఖల ఉన్నతాధికారులతో విపత్తు నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వివిధ రాష్ట్రాలలో అమలు చేస్తున్న అత్యుత్తమ విధానాలకు అనుగుణంగా రాష్ట్రంలో విపత్తు నిర్వహణ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామని వెల్లడించారు. ప్రకృతి విపత్తులు, అగ్నిప్రమాదాలను సమర్థవంతంగా ఎదుర్కొవడానికి ప్రపంచవ్యాప్తంగా అందుబాటులో ఉన్న అత్యుత్తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని, అత్యాధునిక పరికరాలను పరిశీలించి, వాటి వివరాలతో కూడిన సమగ్ర నివేదికను, ప్రతిపాదనలను వెంటనే సమర్పించాలని అధికారులను ఆదేశించారు. నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ (ఎన్‌డీఎంఏ) సహకారంతో నిర్వహిస్తున్న ఈ మాక్ డ్రిల్ ద్వారా లభించే అనుభవాలతో అధికారులు విపత్తుల సమయంలో మరింత బాధ్యతాయుతంగా, సమర్థవంతంగా సేవలు అందించాలని సూచించారు. వరదలు, అగ్ని ప్రమాదాలు, పారిశ్రామిక ప్రమాదాలు వంటి అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు వేగవంతమైన స్పందన, వివిధ శాఖల మధ్య సమన్వయం, ముందస్తు సన్నద్ధత ఎంతో కీలకమని ఆయన అన్నారు. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు మొదటి గంట ఎంతో కీలకమైనదని, దానిని 'గోల్డెన్ అవర్'గా పరిగణించాలని పేర్కొన్నారు. ఆ సమయంలో సిబ్బంది పూర్తి సమన్వయంతో పనిచేస్తూ అందుబాటులో ఉన్న అత్యాధునిక పరికరాలను సరిగ్గా వినియోగించి ప్రజలకు తక్షణ సేవలు అందించాలన్నారు. అగ్నిప్రమాదాలు, వరదల సమయంలో అన్ని వ్యవస్థలు సకాలంలో స్పందించి ఆస్తి, ప్రాణ నష్టాలను కనిష్ట స్థాయికి తగ్గించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రమాదం జరిగిందనే కాల్ రాగానే ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఘటనాస్థలికి సకాలంలో చేరుకుని బాధిత ప్రజలకు వైద్య, రక్షణ సేవలు అందించడం అధికారుల బాధ్యత అని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు వరదలు, అగ్నిప్రమాదాలు, ఆకస్మిక ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, వేగంగా సహాయక చర్యలు చేపట్టడం, అత్యవసర సేవలను సమన్వయం చేసేందుకు ఇలాంటి మాక్ డ్రిల్స్ ఎంతో ఉపయోగపడతాయన్నారు. 1908లో సంభవించిన హైదరాబాద్ మహా వరదలను, ఇటీవలి గోదావరి, కృష్ణా నదుల వరదలను ప్రస్తావిస్తూ విపత్తుల విషయంలో అప్రమత్తత లేకపోతే ఎంతటి ఘోర నష్టం జరుగుతుందో చరిత్ర చెబుతోందన్నారు. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు సాంకేతిక పరిజ్ఞానం, అత్యాధునిక పరికరాలు, శిక్షణ పొందిన రెస్క్యూ బృందాలు ఎల్లప్పుడూ అప్రమత్తంగా సిద్ధంగా ఉండాలని సూచించారు. అడవుల్లో సంభవించే అగ్నిప్రమాదాలు పచ్చదనాన్ని నాశనం చేస్తుంటే పట్టణ ప్రాంతాల్లో పెరుగుతున్న అగ్నిప్రమాదాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

**కనువిందు చేసిన రెస్క్యూ ఆపరేషన్లు**

మాక్ డ్రిల్‌లో భాగంగా గాలితో నింపే లైఫ్ బోట్లు, నీటిలో చిక్కుకున్న వారిని రక్షించే అత్యాధునిక సాంకేతిక పద్ధతులు, అత్యవసర తరలింపు చర్యలు, సమన్వయంతో కూడిన రెస్క్యూ ఆపరేషన్‌లను ప్రత్యేక బృందాలు ప్రత్యక్షంగా ప్రదర్శించాయి. అనంతరం మంత్రి నెక్లెస్ రోడ్ బోటింగ్ క్లబ్‌ను సందర్శించి అక్కడి రెస్క్యూ కార్యకలాపాలను స్వయంగా పరిశీలించారు. రాష్ట్రంలో ఇంత విస్తృత స్థాయిలో మాక్ ఎక్సర్‌సైజ్‌లు నిర్వహించడం అభినందనీయమని పేర్కొంటూ ఎన్‌డీఆరఎఫ్, ఎస్‌డీఆరఎఫ్, విపత్తు నిర్వహణ శాఖ ,జిల్లా అధికారులను అభినందించారు. రాష్ట్రంలో జరుగుతున్న ఈ ప్రదర్శనలు కేవలం ముందస్తు సన్నద్ధతలో భాగంగా నిర్వహిస్తున్న మాక్ డ్రిల్‌లేనని, ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని మంత్రి స్పష్టం చేశారు. మీడియా, సోషల్ మీడియా వేదికల ద్వారా ప్రజలకు ఎల్లప్పుడూ బాధ్యతాయుతమైన, నిజమైన సమాచారమే చేరాలని, పుకార్లను నమ్మవద్దని కోరారు. కార్యక్రమంలో విపత్తు నిర్వహణ శాఖ కార్యదర్శి దాసరి హరిచందన, రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక శాఖ డీజీ విక్రమ్ సింగ్ మాన్, హైడ్రా కమిషనర్ ఎ.వి. రంగనాథ్, ఎన్‌డీఎంఏ లీడ్ కన్సల్టెంట్ మేజర్ జనరల్ (రిటైర్డ్) సుధీర్ బెల్ పాల్గొన్నారు. వీరితోపాటు పోలీస్, ఫైర్, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, రెవెన్యూ, వైద్య ఆరోగ్య, జీహెచ్ఎంసీ, హైడ్రా, పరిశ్రమలు, రవాణా, పశు సంవర్ధక తదితర శాఖల అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

## సంపాదకీయం



# సవాళ్ల నడుమ సమతుల్యత !

ప్రస్తుత ప్రపంచ ఆర్థిక ముఖచిత్రం వేగంగా మారుతోంది. ఒకవైపు సాంకేతిక విప్లవం, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ వైపు అడుగులు పడుతుంటే, మరోవైపు ఇంధన భద్రత, విద్యా వ్యవస్థలో నాణ్యతా ప్రమాణాలు, అంతర్జాతీయ భౌగోళిక ఉద్రిక్తతలు అభివృద్ధి చెందుతున్న దేశాల ముందు పెద్ద సవాళ్లను నిలుపుతున్నాయి. ఈ నేపథ్యంలో, దేశ ఆర్థిక వ్యవస్థను సుస్థిరమైన పంథాలో నడపడం పాలకులకు కత్తిమీద సాములా మారింది. పశ్చిమాసియాలో నెలకొన్న అనిశ్చిత పరిస్థితులు, అంతర్జాతీయ జలసంధుల్లో రవాణా ఆటంకాలు ప్రపంచవ్యాప్తంగా చమురు, ఇంధన సరఫరాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఇంధన ధరల హెచ్చుతగ్గులు కేవలం రవాణా రంగానికే పరిమితం కాకుండా, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలకు కారణమవుతూ ద్రవ్యోల్బణాన్ని పెంచుతున్నాయి. ఇటువంటి తరుణంలో కేవలం సాంప్రదాయ ఇంధనాలపైనే ఆధారపడకుండా, పునరుత్పాదక ఇంధన వనరుల వైపు మొగ్గు చూపడం, విద్యుత్ వాహనాల వినియోగాన్ని వేగవంతం చేయడం అత్యంత అవసరం. మరో ప్రధానమైన అంశం.. మన విద్యావ్యవస్థలో సంస్కరణలు. ఇటీవల దేశవ్యాప్తంగా వివిధ పోటీ పరీక్షల నిర్వహణలో ఎదురవుతున్న లోపాలు, పేపర్ లీకేజీల వంటి సంఘటనలు లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును, వ్యవస్థపై నమ్మకాన్ని ప్రశ్నార్థకం చేస్తున్నాయి. కేవలం పరీక్షల నిర్వహణలోనే కాకుండా, పాఠశాల స్థాయి నుండి ఉన్నత విద్య వరకు మౌలిక వసతుల కల్పన, పరిశోధనలకు పెద్దపీట వేయాలి. యువతకు కేవలం డిగ్రీలు అందించడం కాకుండా, అంతర్జాతీయ మార్కెట్ అవసరాలకు తగ్గట్టుగా నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వాల్సిన సమయం ఆసన్నమైంది. చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు ఊతమివ్వడం ద్వారానే స్థానిక ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావాలంటే వ్యవసాయ రంగాన్ని ఆధునీకరించడంతో పాటు, గ్రామీణ ఉపాధి హామీ పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేయాల్సి ఉంది. ప్రగతి పథంలో దూసుకుపోవడానికి కేవలం దీర్ఘకాలిక ప్రణాళికలు రచిస్తే సరిపోదు. క్షేత్రస్థాయిలో వాటి పటిష్టమైన అమలు, పారదర్శకమైన పరిపాలన ముఖ్యం. రాజకీయ ప్రయోజనాలను పక్కనబెట్టి, ఆర్థిక స్థిరత్వం, సామాజిక భద్రత, యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తీసుకునే నిర్ణయాలే దేశాన్ని ప్రగతిపథంలో ముందుకు నడిపిస్తాయి.

# ప్రజా సమస్యల పరిష్కారంలో చురుగ్గా ఉండాలి

**హైదరాబాద్, మే 18 సిరిన్యూస్:** పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణ, ప్రజా సమస్యల పరిష్కారంలో కార్యకర్తల పాత్రపై బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ఈ మూడు అంశాలపై నాయకులు, కార్యకర్తలు చురుకుగా పనిచేయాలన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రధానమంత్రిగా 12 సంవత్సరాల పాలనను పూర్తి చేసుకోబోతున్న సమయంలో పర్యావరణ దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇంధన పొదుపుపై మేరా భారత్ - మేరా యోగదాన్ (దేశానికి ప్రతి పౌరుడు తన వంతు బాధ్యత నిర్వర్తించడం) అనే కార్యక్రమాన్ని ప్రారంభించిందని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా చమురు కొరత నెలకొనగా అనేక దేశాలు ఇంధన ధరలను భారీగా పెంచాయని, కొన్ని దేశాల్లో రేషన్ విధానం కూడా అమలు చేస్తున్నారని తెలిపారు. మన కేంద్ర ప్రభుత్వం ప్రజలపై అదనపు భారం పడకుండా చూసిందన్నారు. అంతర్జాతీయ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ఇంధన వినియోగంలో క్రమశిక్షణ పాటించాల్సిన అవసరం ఉందని, ప్రజలు సాధ్యమైనంత వరకు ఇంధన పొదుపు చేయాలని, కార్‌పూలింగ్, ప్రజా రవాణా వ్యవస్థను ఎక్కువగా ఉపయోగించాలని, విద్యుత్ వాహనాలను ప్రోత్సహించాలని, అవసరమైతే వర్క్ ఫ్రమ్ హోమ్ ను కూడా అనుసరించాలని సూచించారు. తాను కూడా ఈరోజు విద్యుత్ కారులో వచ్చానని, ఇది ప్రచారం కోసం కాదు..



దేశ ప్రయోజనం కోసం.. మన జీవన విధానంలో మార్పు తీసుకురావాల్సిన అవసరం ఉందనే సందేశం ఇవ్వడంతోపాటు ప్రధాని మోదీ సందేశాన్ని ఆచరణలో పెట్టడానికేనని స్పష్టం చేశారు. కార్యకర్తలు కూడా ఈ దిశగా ఆలోచించాలని రామచందర్ రావు పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అంటూ 'ఒక చెట్టు - అమ్మ పేరు మీద' కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలన్నారు. ప్రకృతి పరిరక్షణ కోసం స్థానిక ఉత్పత్తులను వినియోగించాలని, స్వదేశీ వస్తువులను ప్రోత్సహించాలని, పర్యావరణ పరిరక్షణను సామాజిక బాధ్యతగా భావించి ముందుకు సాగాలని కోరారు. కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లి కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలను వివరించాలన్నారు.

**బీఆర్ఎస్‌పై విమర్శల దాడి**

బీఆర్ఎస్ వంటి పార్టీల వైఖరి వల్ల రాజకీయ పరిస్థితులు దారుణంగా తయారయ్యాయని విమర్శించారు. ముఖ్యంగా ఆ పార్టీ నాయకులు బీజేపీని లక్ష్యంగా చేసుకుని ఒక వ్యక్తిని, ఆ కుటుంబాన్ని టార్గెట్ చేస్తూ రాజకీయ లబ్ధి పొందాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. పెద్ద ఎత్తున ఖర్చుతో పోస్టర్లు, సోషల్ మీడియా ప్రచారం, అనుకూల మీడియా ద్వారా బద్నాం చేసే ప్రయత్నం జరుగుతోందన్నారు. ఎవరైనా తప్పు చేసి ఉంటే చట్ట ప్రకారం చర్యలు తప్పవని, ఒకవేళ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తప్పు చేసి ఉంటే పార్టీ కూడా చర్యలు తీసుకుంటుందని చెప్పారు. కానీ ఇక్కడ జరిగింది ఆయన కుటుంబ సభ్యులకు సంబంధించింది. వారు తప్పు చేసి ఉంటే చట్టం తన పని చేస్తుంది.. కోర్టులు నిర్ణయం తీసుకుంటాయి అని అన్నారు. చట్టపరమైన హక్కుల ప్రకారం ముందస్తు బెయిల్ తీసుకోవడం పారిపోవడం కాదన్నారు. ముందు బీఆర్ఎస్ నాయకులు తమ పాలనలో జరిగిన ఘటనలకు సమాధానం చెప్పాలన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అక్రమాలు, అవినీతి అంశంపై విచారణలు ప్రారంభమయ్యాక కోర్టులను ఆశ్రయించిన వారు ఇప్పుడు నైతికత గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని వ్యాఖ్యానించారు. ఎన్‌సీఆర్‌బీ గణాంకాల ప్రకారం 2014లో మహిళలపై నమోదైన కేసులు 14,147 ఉండగా 2023 నాటికి అవి 23,679కి చేరాయని, అంటే మహిళలపై నేరాలు సుమారు 67 శాతం పెరిగాయని, దీనికి బీఆరఎస్ నాయకత్వం సమాధానం చెప్పాలని నిలదీశారు. 2022లో జూబ్లీహిల్స్ మైనర్ బాలికపై అత్యాచారం, 2019లో కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో సమత (30) పై సామూహిక అత్యాచారం జరిగింది.. ఈ ఘటనలపై మీ నైతిక బాధ్యత ఎక్కడికి పోయింది అని ప్రశ్నిస్తున్నానన్నారు. వేధింపులను తట్టుకోలేక 2023లో వరంగల్‌లో డాక్టర్ ప్రీతి ఆత్మహత్య చేసుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. దీనికి మీ ప్రభుత్వం బాధ్యత వహించదా? ముఖ్యమంత్రి బాధ్యత వహించరా? అదేవిధంగా మీ పార్టీకి చెందిన ఓ మహిళా సర్పంచ్ తనపై ఎమ్మెల్యే లైంగిక వేధింపులు చేస్తున్నారని ఫిర్యాదు చేశారు.. సూర్యాపేట జిల్లాకు చెందిన లంబాడ యువతి లక్ష్మి పోలీసుల వేధింపుల వల్లే ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ కస్టడీలో మృతిచెందిందనే ఆరోపణలు వచ్చాయి. అంతేకాదు కేటీఆర్.. మీ పాలనలో టీఆర్ఎస్‌కు చెందిన కార్పొరేటర్లు, నాయకులు కూడా పలు అత్యాచార, మహిళా వేధింపుల కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఆ నాయకులతో సంబంధాలున్న వ్యక్తులు యువతులకు డ్రగ్స్ ఇచ్చి కిడ్నాప్ చేసిన కేసుల్లో కూడా ఆరోపణలు ఎదుర్కొన్నారని రామచందర్‌రావు తెలిపారు. నిర్మల్‌లో మైనర్ పై అత్యాచారం కేసులో కూడా టీఆర్ఎస్ నాయకుల పేర్లు వినిపించాయి. మహిళల హక్కులు, మైనర్ల భద్రత గురించి మాట్లాడే నైతిక హక్కు మీకు ఎక్కడుంది.. ఆ సమయంలో కేసీఆర్ రాజీనామా చేశారా.. కేటీఆర్ బాధ్యత తీసుకున్నారా.. ఎవరైనా నైతిక బాధ్యత వహించారా అని ప్రశ్నించారు. ఇప్పుడు మాత్రం రాజకీయ ప్రయోజనాల కోసం బీజేపీపై విమర్శలు చేయడం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమేనని అన్నారు. కేటీఆర్ కుటుంబీకులపై లిక్కర్ స్కామ్ ఆరోపణల సమయంలో కూడా బీఆర్ఎస్ నాయకత్వం రాజీనామాలు చేయలేదు. కాళేశ్వరం, ఫార్ములా ఈరేస్ వంటి అంశాల్లో ఇరుక్కుపోతామనే భయంతో కేటీఆర్‌తోపాటు ఇతర బీఆర్ఎస్ నాయకులు బీజేపీపై విష ప్రచారం చేస్తున్నాని రామచందర్‌రావు విమర్శించారు. సమావేశంలో పలువురు పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సింపుల్ ఈగవర్నెన్స్‌తో మెరుగైన సేవలు

- **సీఎస్‌లకు కేంద్ర కేబినెట్ సెక్రటరీ సోమనాథన్ ఆదేశం**

**హైదరాబాద్, మే 18 సిరిన్యూస్:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సింపుల్ ఈగవర్నెన్స్ ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని కేంద్ర ప్రభుత్వ కేబినెట్ సెక్రటరీ డాక్టర్ టి.వి.సోమనాథన్ ఆయా రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులను ఆదేశించారు. తమిళనాడు ప్రభుత్వం అనుసరిస్తున్న సింపుల్ ఈగవర్నెన్స్ విధానాన్ని ఇతర రాష్ట్రాలు కూడా పాటించి ఆయా రాష్ట్రాలలో ఉన్న నిబంధనల మేరకు ప్రజలకు సరళతరమైన, మెరుగైన ప్రభుత్వ సేవలను అందించేందుకు ప్రయత్నించాలని సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన సూచించారు. ఈ



సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈగవర్నెన్స్ విధానాన్ని వివరించారు. ప్రజలకు పాదర్శకంగా సులభతరమైన పౌర సేవలను అందిస్తున్నామని, ఎప్పటికప్పుడు విభాగాల వారీగా ఆన్ లైన్‌లో డ్యాష్ బోర్డుల ద్వారా తెలియజేస్తున్నామని చెప్పారు. మున్సిపల్, ఇండస్ట్రీస్, ఎడ్యుకేషన్, ఎనర్జీ, రెవెన్యూ తదితర శాఖల్లో ఈగవర్నెన్స్ ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవల గురించి తెలిపారు. ఈగవర్నెన్స్ విధానంపై సీఎస్ రామకృష్ణారావును కేబినెట్ సెక్రటరీ అభినందించారు. తమిళనాడు ప్రభుత్వ విధానాన్ని కూడా అధ్యయనం చేసి ప్రజలకు ఎలాంటి ఆర్థిక భారం, ఇతర ఇబ్బందులు కలగకుండా ఈగవర్నెన్స్ విధానాల్లో మార్పులు చేస్తామన్నారు. సమావేశంలో స్పెషల్ సీఎస్ నవీన్ మిట్టల్, ముఖ్య కార్యదర్శి యోగితా రాణా, షికా గోయల్, సెక్రటరీలు రఘునందన్ రావు, ఇ.శ్రీధర్, అనితా రామచంద్రన్, హౌసింగ్ ఎండీ వి.పి.గౌతం, సెర్ప్ సీఈవో దివ్య తదితరులు పాల్గొన్నారు.

## భూమి కోసం అక్కను హత్య చేసిన తమ్ముడు

**సూర్యపేట, మే 18 సిరిన్యూస్:** ఆస్తి కోసం సొంత అక్కను తమ్ముడు హత్య చేసిన ఘటన సూర్యాపేట జిల్లా ఆత్మకూరు మండలం తుమ్మల పెన్‌పహాడ్‌లో చోటుచేసుకుంది. సురుగి అంజమ్మ భర్త మరణించడంతోపాటు పిల్లలు లేకపోవడంతో తన స్వగ్రామమైన తుమ్మల పెన్‌పహాడ్ లో చెల్లెలు వద్ద నివాసం ఉంటోంది. ఈ క్రమంలో తనను చూసుకుంటున్న చెల్లెలికి తన పేరుపై ఉన్న రెండు ఎకరాల భూమిని ఇవ్వాలని అంజమ్మ నిర్ణయించినట్లు సమాచారం. అయితే ఈ విషయంలో అక్క, తమ్ముడు మధ్య కొంతకాలంగా తీవ్ర వివాదం కొనసాగుతున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. తనకు కాకుండా చెల్లెలికి భూమి ఇస్తానని అంజమ్మ చెప్పడంతో తమ్ముడు తీవ్ర ఆగ్రహానికి గురైనట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం సుమారు 6:45 గంటల సమయంలో అంజమ్మ కరువు పనులకు వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన తమ్ముడు పదునైన కత్తితో పలుమార్లు దాడి చేసినట్లు సమాచారం. తీవ్ర గాయాలతో రక్తపు మడుగులో పడిపోయిన ఆమెను స్థానికులు వెంటనే హాస్పిటల్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందినట్లు తెలిసింది. ఘటనతో తుమ్మల పెన్‌పహాడ్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# దరఖాస్తుల పరిష్కారానికే ప్రజావాణి



- **ప్రజావాణిలో 101 దరఖాస్తుల స్వీకరణ.**
- **జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.**

**...దక్ మే,18(సిరిన్యూస్)** ప్రజావాణిలో ఇచ్చిన దరఖాస్తుల పరిష్కా...నికి అధికారులు తక్షణ చర్యలు తీసుకో...లని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ...లిపారు.సోమవారం ఐడిఓసి కార్యాల...ంలో అన్ని శాఖల అధికారులతో ...ర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి 101 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. వాటిలో భూభారతి 52, ఇందిరమ్మ ఇల్లు 08, పెన్షన్లు 9,ఇతర 32దరఖాస్తులస్వీకరించామన్నారు.ప్రజలు నుండి స్వీకరించిన సమస్యల దరఖాస్తులు సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జెడ్పిసిఓ ఎల్లయ్య, డిఆర్ఓ అంబాదాస్ రాజేశ్వర్, డి ఆర్ డి ఏ శ్రీనివాసరావు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నిజామాబాద్‌కు పంగనామాలు


- **ఇచ్చిన హామీలను పట్టించుకోని రేవంత్**
- **తలెత్తుకోలేకపోతున్న పీసీసీ చీఫ్**
- **ఎంపీ అరవింద్ విమర్శలు**

**నిజామాబాద్, మే 18 సిరిన్యూస్:** నిజామాబాద్ జిల్లాకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పంగనామాలు పెట్టారని స్థానిక ఎంపీ, బీజేపీ నేత ధర్మపురి అరవింద్ మండిపడ్డారు. ఔటర్ రింగ్ రోడ్డు, భూగర్భ డ్రైనేజీ హామీలు ఏమయ్యాయన్నారు. ఈ హామీలు నెరవేర్చకపోవడంతో పీసీసీ చీఫ్ తలెత్తుకోలేకపోతున్నారన్నారు. నిజామాబాద్‌లో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌ను రాజకీయంగా అణగదొక్కేందుకే జిల్లాకు మొండిచేయి చూపారని విమర్శించారు. ఇంకా ఏ ముఖం పెట్టుకుని ఈ జిల్లాలో ఆయన తిరుగుతున్నారని ప్రశ్నించారు. ఇందూరు ప్రజలను మోసం చేస్తే బుద్ధి చెబుతారన్నారు. దేవుళ్లను మోసం చేసిన వాడికి ప్రజలను మోసం చేయటం లెక్క కాదని ఎంపీ విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తికావని కుండ బద్దలు కొట్టారు. ఇప్పటివరకు 25 శాతం పనులు కూడా పూర్తి కాలేదన్నారు. రూ.162 కోట్లకు గాను రూ.10 కోట్ల నిధులు మాత్రమే ప్రభుత్వం కేటాయించిందన్నారు. 2039 వరకు రాహుల్ ప్రధాని కారని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారంటే రాహుల్ ఇక ప్రధాని కాలేరని వ్యాఖ్యానించారు. తద్వారా ఇంకో పదేళ్లు దేశంలో బీజేపీ ఉంటుందని సీఎం ఒప్పుకున్నారన్నారు. రేవంత్ రెడ్డికి బదులు కోమటిరె



డ్డి వంటి జెన్యూన్ పర్సన్‌ను ముఖ్యమంత్రిగా నియమించాలని కాంగ్రెస్ అగ్రనేతలకు ఎంపీ అరవింద్ సూచించారు. బుల్లెట్ రైల్ కారిడార్ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని విమర్శించారు. పట్టణాన్ని అప్‌గ్రేడ్ చేస్తానని ప్రకటించిన బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్‌నే ప్రజలు నమ్మలేదని, ఇక లేని ఫ్యూచర్ సిటీ అంటే నమ్ముతారా అంటూ సీఎం రేవంత్ రెడ్డికి చురకలు అంటించారు.

# కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణి




**...ూప్రాన్ మే 18 సిరి న్యూస్**

తూప్రాన్ మున్సిపాలిటీ పరిధిలోని ...6వ వార్డులో సోమవారం కళ్యాణ లక్ష్మి ...క్కుల పంపిణీ చేసిన కౌన్సిలర్ బొడ్డు ...ోష్న వేణు మాట్లాడుతూ 16 వ వార్డులో ...ళ్యాణ లక్ష్మి. షాదీముబారక్ చెక్కులు 8మంది లబ్ధిదారులకు ఇంటి ఇంటికి వేళ్ళి చెక్కులు పంపిణీ చేశారు ఒక్కరికి లక్ష నూట పదహారు రూపాయల చెక్కులను అందజేశామన్నారు రెండవ విడిత ఇందిరమ్మ ఇళ్లకు అర్హులైన వారు మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు లు చేసుజోవాలని కౌన్సిలర్ కోరారు

# తెలంగాణకు చల్లటి కబురు

**హైదరాబాద్, మే 18 సిరిన్యూస్:** భానుడి భగభగలతో ఉక్కిరిబిక్కిరవుతున్న తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ కాస్త ఊరటనిచ్చే సమాచారం వెల్లడించింది. రాష్ట్రంలో ఉపరితల చక్రవాత ఆవర్తన ప్రభావంతో నేడు, రేపు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. గత కొన్ని రోజులుగా తీవ్ర ఎండలతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు ఈ వర్షాలు కొంత ఉపశమనం కలిగించే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం హైదరాబాద్‌తో పాటు భద్రాద్రి కొత్తగూడెం, నల్లగొండ, వికారాబాద్, మహబూబ్‌నగర్, కామారెడ్డి, మల్కాజిగిరి, రంగారెడ్డి, వనపర్తి, గద్వాల జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉంది. కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడే అవకాశమున్నట్లు అధికారులు తెలిపారు.





గత కొన్ని రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు భారీగా నమోదవుతున్నాయి. మధ్యాహ్న సమయంలో ప్రజలు బయటకు రావడానికి కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితుల్లో వర్షాలు కురవడం వల్ల ఉష్ణోగ్రతలు కొంత మేర తగ్గే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు భావిస్తున్నారు. అయితే ఈ ఉపశమనం తాత్కాలికమేనని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఎల్లుండి నుంచి రాష్ట్రంలో మళ్లీ ఎండల తీవ్రత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ స్పష్టం చేసింది. పలు జిల్లాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉండటంతో రెడ్ అలర్ట్ కూడా జారీ చేశారు. ఎండల ప్రభావం అధికంగా ఉండే అవకాశాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. అత్యవసరమైతే తప్ప మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లకూడదని, బయటకు వెళ్లాల్సి వస్తే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.
వేసవి తీవ్రత దృష్ట్యా ఎక్కువగా నీరు తాగడం, శరీరాన్ని చల్లగా ఉంచుకోవడం, చిన్నారులు, వృద్ధులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవడం అవసరమని సూచించారు. రానున్న రోజుల్లో వాతావరణ పరిస్థితులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరారు.



# త్వరలో హైదరాబాద్ మెట్రో రద్దీకి చెక్..

**మొదటిపేజీ తరువాయి**

సేవలందిస్తున్నాయి. ఒక్కో రైలుకు మూడు కోచ్‌లు మాత్రమే ఉండటంతో ప్రతిరోజూ ప్రయాణించే దాదాపు 5 లక్షల మంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో ఎల్బీనగర్ మియాపూర్, నాగోల్ రాయదుర్గం మార్గాల్లో రైళ్లలో నిలబడటానికి కూడా చోటు దొరకని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలోనే అదనపు కోచ్‌ల కొనుగోలు అనివార్యంగా మారింది. ఆర్డర్ ఇచ్చిన నాటి నుంచి కేవలం 15 నెలల వ్యవధిలోనే కొత్త కోచ్‌లను సరఫరా చేస్తామని బీఈఎంఎల్ ప్రభుత్వానికి స్పష్టం చేసింది. గతంలో రద్దీని అధిగమించేందుకు నాగ్‌పూర్ మెట్రో నుంచి కొన్ని కోచ్‌లను లీజుకు తీసుకోవాలని ప్రయత్నించినా, సాంకేతిక కారణాలతో అది ముందుకు సాగలేదు. అయితే, ఇటీవల హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టు పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోకి రావడంతో కోచ్‌ల కొనుగోలుకు ఉన్న అడ్డంకులు తొలగిపోయాయి. దీంతో బీఈఎంఎల్‌కు ఆర్డర్ ఇచ్చే ప్రక్రియ చివరి దశకు చేరుకుంది. 2015లో సుమారు రూ.1800 కోట్లతో దక్షిణ కొరియాకు చెందిన హ్యుందాయ్ రొటెమ్ సంస్థ నుంచి మెట్రో కోచ్‌లను కొనుగోలు చేశారు. ఇప్పుడు కొత్త కోచ్‌ల తయారీ కోసం హ్యుందాయ్ తమ సాంకేతికతను బీఈఎంఎల్‌కు బదిలీ చేసేందుకు అంగీకరించింది. దేశంలోని అనేక మెట్రో ప్రాజెక్టులకు విజయవంతంగా కోచ్‌లను సరఫరా చేసిన అనుభవం బీఈఎంఎల్‌కు ఉంది. ఈ 60 కొత్త కోచ్‌లు అందుబాటులోకి వస్తే, రద్దీ మార్గాల్లో రైళ్ల ఫ్రీక్వెన్సీ పెరగడంతో పాటు ప్రయాణికులకు సీటింగ్ సామర్థ్యం కూడా పెరుగుతుంది. ఫలితంగా మెట్రో ప్రయాణం మరింత సౌకర్యవంతంగా, సుఖవంతంగా మారనుంది.

## కేబీఆర్ ఫ్లైఓవర్‌పై

# సుప్రీంకోర్టు ఆదేశాలు

**మొదటిపేజీ తరువాయి**

సందర్భంగా పార్కు పరిధిలోని ఇరవై ఐదు నుంచి ముప్పై మీటర్ల పరిధిలో ఉన్న చెట్లను తొలగించవద్దని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ ప్రాజెక్టు కోసం దాదాపు వెయ్యి మూడు వందల చెట్లను నరికివేయబోతున్నారని పిటిషనర్ల తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. చెట్ల తొలగింపుకు బదులుగా ప్రత్యామ్నాయ ప్రణాళికలు పరిశీలించారా అని న్యాయస్థానం ప్రశ్నించింది. చెట్లు నరకకుండా నిర్మాణ పనులు చేపట్టే అవకాశం ఉందా అనే అంశంపై కూడా వివరణ కోరింది. అయితే అలాంటి ప్రణాళిక ప్రస్తుతం లేదని పిటిషనర్ల తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ప్రభుత్వం రాత్రి, పగలు అనే తేడా లేకుండా చెట్ల తొలగింపు చేపడుతోందని పిటిషనర్లు ఆరోపించారు. పర్యావరణానికి తీవ్ర నష్టం కలిగే అవకాశం ఉందని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించినట్లు సమాచారం. వాదనలు విన్న అనంతరం రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర పర్యావరణ శాఖను ప్రతివాదులుగా చేర్చి నోటీసులు జారీ చేసింది. ఈ అంశంపై పూర్తి వివరాలు సమర్పించాలని ఆదేశించింది. ఈ కేసులో తదుపరి విచారణను జూలై ఇరవై ఏడుకు వాయిదా వేసింది. అప్పటి వరకు చెట్ల తొలగింపుపై ఆంక్షలు కొనసాగనున్నాయి. ఈ పరిణామం పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.



## ఆరు గిరిజన మ్యూజియంలు

# రాష్ట్రానికి గర్వకారణం

- **గిరిజన సంక్షేమ శాఖ స్పెషల్ సెక్రటరీ కమ్ డైరెక్టర్ సంతోష్**

**హైదరాబాద్, మే 18 సిరిన్యూస్:**

ఇతర రాష్ట్రాలలో సాధారణంగా ఒక్క గిరిజన మ్యూజియం మాత్రమే ఉండగా తెలంగాణలో ఆరు గిరిజన మ్యూజియంలు ఏర్పాటు చేయడం రాష్ట్రానికి గర్వకారణమని గిరిజన సంక్షేమ శాఖ స్పెషల్ సెక్రటరీ కమ్ డైరెక్టర్ సంతోష్ బి.ఎమ్ అన్నారు. వేగంగా మారుతున్న ఆధునిక సమాజంలో గిరిజనుల సంస్కృతీ సంప్రదాయాలు, జీవన విధానం, విలువలు తదితర వారసత్వ సంపదను భావితరాలకు పరిచయం చేసే ప్రధాన వేదికలుగా మ్యూజియంలు నిలుస్తాయన్నారు. హైదరాబాద్‌లోని గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మ్యూజియం డే వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా నెహ్రూ శత జయంతి ట్రైబల్ మ్యూజియంలో ఏర్పాటు చేసిన కుమ్రం భీమ్, సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహాలకు పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కుమ్రం భీమ్, రాంజీ గోండ్ వంటి గిరిజన వీరులు ప్రజల హక్కులు, స్వేచ్ఛ, స్వాభిమానాల కోసం చేసిన పోరాటాలు, త్యాగాలు తదితర చారిత్రక అంశాలను యువతకు తెలియజేయడంలో గిరిజన మ్యూజియంలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. విద్యార్థులు, యువత ఆసక్తిగా నేర్చుకునే విధంగా గిరిజన మ్యూజియంలను ఇంటరాక్టివ్, డిజిటల్, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. నవంబర్ 15 నాటికి రాంజీ గోండ్ స్మారక గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియంను అత్యాధునిక హంగులతో పూర్తి చేసి ప్రధానమంత్రిని ఆహ్వానించి ఆవిష్కరించేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ అదనపు సంచాలకుడు సర్వేశ్వర్ రెడ్డి, టి.ఆర్.ఐ డైరెక్టర్ సముజ్వల, మ్యూజియం క్యూరేటర్ సత్యనారాయణ, ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# లారీల కోసం రైతుల ఆందోళన

- **అన్నదాతలను ఆగం చేస్తున్న లా రీ యూనియన్**

**కొల్చారం, మే 18,(సిరి న్యూస్)**





కొల్చారం మండలంలోని పోతంశెట్టిపల్లి గ్రామ శివారులో ఏడుపాయల టీ జంక్షన్ వద్ద సోమవారం ఎన్ హెచ్ 765 డి రహదారిపై సుమారు రెండు గంటలపాటు రైతన్నలు లారీల కోసం రాస్తారకో నిర్వహించారు. సుమారు 3500 వడ్ల బస్తాలు తూకం వేసి ఐదు రోజులు గడుస్తున్న ఒక్క లారీ కూడా రాక పోవడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. లారీలు ఎందుకు రావడం లేదని గ్రామ సర్పంచ్ దయాకర్ గౌడ్ లారీ యూనియన్ వాళ్లను నిలదీస్తే బయట మాకు 15 000 రూపాయలు ఇస్తున్నారు, మీరు 17000 రూపాయల నుంచి 20000 రూపాయలు మాకు డబ్బులు ఇస్తేనే లారీలు వస్తాయంటూ లారీ యూనియన్ వాళ్లు రైతులకు తెలిపారు. రైతుల దగ్గర లారీ యూనియన్ వాళ్లు డబ్బులు డిమాండ్ చేస్తే అధికారులు ఏం చేస్తున్నారంటూ రైతన్నలు నిలదీశారు. కనీసం తూకం వేసిన వడ్ల బస్తాలను కూడా రైస్ మిల్లులకు తరలించలేకపోతున్నారని ఈరోజు లారీలు రాకపోతే వందల మంది రైతులతో కలసి నేషనల్ హైవే ఎన్ హెచ్ 765 డి రహదారిపై బైఠాయించి రస్తారకో గంటలపాటు నిర్వహిస్తామని అవసరమైతే కేసులు పెట్టిన మేము వెనుకాడమని రైతన్నలు తెలిపారు. విషయం తెలుసుకున్న కొల్చారం ఎస్సై మహమ్మద్ మహినుద్దీన్ హుటాహుటిన రైతుల దగ్గరికి వెళ్లి రోడ్డుపై బైఠాయించిన రైతులకు నచ్చజెప్పి లారీలు ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు. అలాగే వరిగుంతం సీతారాం తాండ గ్రామాలకు చెందిన రైతులు తహసిల్దార్ వద్దకు వచ్చి గ్రామంలో 7500 బస్తాలు తూకం వేసి వారం రోజులు గడిచిన కూడా ఇంతవరకు లారీలు రాలేదని రైతులతో కలిసి సొసైటీ చైర్మన్ చిన్నారపు ప్రభాకర్ తహసిల్దార్ శ్రీనివాస చారి కి విన్నవించుకున్నారు.

**తాసిల్దార్ శ్రీనివాస చారి ఇచ్చిన హామీ**

వరిగుంతం గ్రామానికి రెండు రోజులలో లారీలను పంపించగలనని తాసిల్దార్ శ్రీనివాస చారి రైతులకు హామీ ఇచ్చారు రెండు రోజులలో లారీలు పంపించలేనిచో పెద్ద ఎత్తున రాస్తారకోలు నిర్వహిస్తామని వరిగుంతం సీతారాం తండా పోతం శెట్టిపల్లి గ్రామాల రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ప్రజావాణిని పటిష్టంగా అమలు చేయాలి






- **ప్రజలకు మరింత చేరువలో డివిజన్ కార్యాలయాల్లో ప్రజావాణి**
- **రాష్ట్రస్థాయి ప్రజావాణి ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ రాకేష్ రెడ్డి.**

**మెదక్ మే,18(సిరిన్యూస్)**

ప్రజావాణిని మరింత పకడ్బందీగా అమలు చేయాలని, ప్రజలకు చేరువలో డివిజన్ కార్యాలయంలో ప్రజావాణి పటిష్టంగా అమలు చేయాలని రాష్ట్రస్థాయి ప్రజావాణి ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ రాకేష్ రెడ్డి అన్నారు. సోమవారం డివిజన్ కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమాన్నీ సందర్శించారు.అనంతరం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తో ప్రజావాణి బలోపేతంపై సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రజావాణి కార్యక్రమానికి మరిన్ని కౌంటర్లు పెంచాలని, ప్రజావాణి లో కొన్ని చిన్న చిన్న మార్పులు చేర్పులు చేయాలని అధికారులకు సూచించారు.ప్రతి దరఖాస్తును అధికారులు వ్యక్తి గతంగా పరిశీలించాలని సంబంధిత శాఖలకు వెంటనే ఎండార్స్మెంట్ చేయాలన్నారు . ప్రజలకు సమయపాలనతో సేవలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు అందిన ప్రతి దరఖాస్తును ప్రజావాణి పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. దరఖాస్తు దరఖాస్తుదారునికి రశీదు అందజేయాలని, తద్వారా సమస్యల పరిష్కారం పట్ల పారదర్శకత నెలకొల్పాలని ఆదేశించారు. అదేవిధంగా, దరఖాస్తు పరిష్కారానికి సంబంధించి శాఖల అధికారులు తీసుకున్న చర్యల వివరాలను పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు.జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ..ప్రజావాణి ద్వారా అందిన ప్రతి వినతిని ప్రాధాన్యంగా తీసుకుని, నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పరిష్కారం లో ఆలస్యం జరిగితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రస్థాయి ప్రజావాణి అధికారి శృతి నాయక్ , అదనపు కలెక్టర్ నగేష్, జెడ్పి సీఈ ఎల్లయ్య, డిఆర్ఓ అంబాదాస్ రాజేశ్వర్ డిఆర్డిఓ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



# నల్లకుంట చెరువులో అక్రమ బోరు మోటర్ తొలగించాలని వినతి

- **తహసిల్దార్, ఎంపీడీవోలకు గ్రామస్తుల వినతిపత్రం**

**గుమ్మడిదల, మే 18 (సిరి న్యూస్ ):**



గుమ్మడిదల మండలం పరిధిలోని రాంరెడ్డిభాయి గ్రామంలోని నల్లకుంట చెరువు మధ్యలో అక్రమంగా ఏర్పాటు చేసి వినియోగిస్తున్న బోరు మోటర్‌ను వెంటనే తొలగించాలని వార్డు సభ్యులు మరియు గ్రామ నాయకులు తహసిల్దార్ పరమేశం, ఎంపీడీవో ఉమాదేవిలకు వినతిపత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ నల్లకుంట చెరువు మధ్యలో అక్రమంగా బోరు మోటర్ ఏర్పాటు చేసి నీటిని వినియోగించడం వల్ల పరిసర ప్రాంతాల్లోని బోర్లు దెబ్బతింటున్నాయని తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా చెరువులో ఈ బోరు వేసి నీటిని వినియోగించుకుంటున్నా రని తెలిపారు. భవిష్యత్తులో గ్రామ ప్రజలకు తీవ్ర నీటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. చెరువులో అక్రమంగా ఏర్పాటు చేసిన బోరు మోటర్‌ను వెంటనే తొలగించి గ్రామ ప్రజల ప్రయోజనాలను కాపాడాలని కోరారు అలాగే చెరువు నీటి వనరులను పరిరక్షించేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. సమస్యపై తక్షణమే క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కొంతం మన సాసురేందర్ రెడ్డి, సామల సౌజన్యగోవర్ధన్ రెడ్డి, సామల ఝాన్సీరాజిరెడ్డి, అభిలాష్ గౌడ్, గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్ బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి నాయకులు పద్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 20న మెడికల్ షాప్స్ బంద్‌కు సహకరించండి






- **తెలంగాణ ఫార్మాసిస్టు కమిటీ చైర్మన్ యెదిరె రమేశ్**

**జోగిపేట, మే 18, (సిరి న్యూస్):**

ఆన్‌లైన్‌లో మందుల డెలివరీకి వ్యతిరేకంగా ఈనెల 20వ తేదిన ఆల్ ఇండియా స్థాయిలో మెడికల్ షాపులను బంద్ చేస్తున్నట్లు తెలంగాణ ఫార్మాసిస్టు కమిటీ చైర్మన్, జిలా మెడికల్ అసోసియేషన కోశాదికారి యెదిరె రమేశ్ తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. బుధవారం నాడు తలపెట్టిన బంద్ విషయమై జోగిపేట స్థానిక తహసీల్దారు, పోలీస్‌స్టేషన్‌లలో ముందస్తుగా సమాచారం ఇవ్వడం జరిగిందని తెలిపారు. కాబట్టి మందులు అవసరమైన వారు ఒక రోజు ముందుగానే కొనుగోలు చేసుకోవాలని కోరుచున్నాను. కస్టమర్లకు ఆన్‌లైన్ ద్వారా జరుగుతున్న మోసహారితమెన మందుల విక్రయాలను అరికటడానికే షాపులను బంద్ చేసి నిరసన తెలియజేస్తున్నామన్నారు అర్హత కలిగిన ఫార్మాసిస్టులు లేకుండా మందుల విక్రయాలు జరపడం ఆరోగ్యానికి ప్రమాదకరమని అన్నారు. మెడికల్ షాపును బంద్‌కు అందరూ సహకరించాలని ఆయన కోరారు. జోగిపేట పట్టణ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు రాచకొండ సాయిబాబ, కోశాధికారి గుండ శ్రీనివాస్‌లతోపాటు సభ్యులు ఆయన వెంట ఉనారు.

## అక్రమ మట్టి రవాణాపై తహసిల్దార్ ఉక్కుపాదం

**ఐదు టిప్పర్లు రెండు హిటాచీలకు జరిమానా**
**డే అండ్ నైట్ టిప్పర్ల ఇష్ట రాజ్యం బ్రేక్ వేసిన తహసిల్దార్**
**ప్రైవేటు వెంచర్ల ఇష్టారాజ్యం**
**నిబంధనలు ఉల్లంఘిస్తే సహించేది లేదు**
**ఫీల్డ్ లోకి ఎంటర్ అయిన తహసిల్దార్ సర్వేయర్...**
**సరిహద్దులు భూములపై విస్తృత తనిఖీలు**



**ఆమీన్ పూర్ మే 18 సిరి న్యూస్**

అమీన్ పూర్ మండల పరిధిలోని ఐదు గ్రామాల్లో సోమవారం తహసిల్దార్ వెంకటేష్ విస్తృత పర్యటన, వడక్పల్లి ,గండిగూడ, సుల్తాన్పూర్, దయారా, రేండ్ల గడ్డ గ్రామాలలో సర్వేయర్ తో కలిసి సంయుక్తంగా క్షేత్ర స్థాయి పరిశీలన జరిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ విచ్చలవిడి రవాణా అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా , పగలు రాత్రి, తేడా లేకుండా ఇస్టా రాజ్యాంగ తిరుగుతున్న టిప్పర్లకు సోమవారం జరిమానాలు వేయడం జరిగిందని తెలిపారు. ఎలాంటి ప్రభుత్వ పరిమిషన్లు లేకుండా అతివేగంతో ప్రయాణిస్తూ ప్రజలను ఇబ్బంది పెడుతున్న పలు టిప్పర్లను స్పాట్లోనే పట్టుకోవడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రామాయంపేట మండల ఈవెంట్ నూతన కార్యవర్గం ఎన్నిక.



**రామాయంపేట, మే 18 (సిరి న్యూస్)**

రామాయంపేట మండల ఈవెంట్ యూనియన్ కార్యవర్గం నూతనంగా ఏడుపాయల సన్నిధిలో నిర్వహించారు. అధ్యక్షులు గా మూడవసారి గుడ్ల మహేష్, ఉపాధ్యక్షుడు గా ఏంద్రాల రాజు గౌడ్,గౌరవ అధ్యక్షులు గా ముద్రకోల్ ప్రకాష్,సల హాదారులు గా మ్యాతారీ ప్రవీణ్, కార్యనిర్వాహధికారిగా పసుల నరేష్, కోశాధికారి గా ఇందూరి నరేష్ గౌడ్, కార్యవర్గ సభ్యులుగా శివ కుమార్,గోవర్ధన్, మహేష్,లక్ష్మణ్, రామకృష్ణ ను ఏనుకోవటం జరిగింది. నూతనంగా ఎన్నుకున్న కార్యవర్గం యూనియన్ అభివృద్ధి కు కృషి చేస్తామని తెలుపడం జరిగింది

## ఉద్యమకారులందరికీ న్యాయం చేయాలి

**ఎమ్మెల్సీ కోదండరాంను కలిసిన తెలంగాణ ఉద్యమకారులు**

**గుమ్మడిదల, మే 18 (సిరి న్యూస్ ):**



తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ప్రతి ఉద్యమకారుడికి ప్రభుత్వం సముచిత గుర్తింపు ఇవ్వాలని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు, తెలంగాణ జేఏసీ మాజీ చైర్మన్, ఎమ్మెల్సీ కోదండరాంను ఉద్యమకారులు కోరారు. ఈ మేరకు తెలంగాణ ఉద్యమకారుడు గుమ్మడిదల మండలం కానుకుంట గ్రామానికి చెందిన కుమ్మరి వెంకటేష్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు సోమవారం మర్యాద పూర్వకంగా కోదండరాంను కలిసి వినతి పత్రం అ ంద జేశారు. తెల ంగాణ ప్రభుత్వం ఉద్యమకారుల గుర్తింపు కోసం ఐదుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేసిన నేపథ్యంలో కమిటీ సభ్యుడిగా ఉన్న కోదండరాంను కలిసి ఉద్యమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. ఉద్యమ సమయంలో వివిధ రూపాల్లో సేవలందించిన వారికి సరైన గుర్తింపు, ప్రాధాన్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని పేర్కొన్నట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జన సమితి పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ యువనాయకుడు తుడుం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# గండిగూడ వెంచర్లపై తహసిల్దార్ నజర్!

- **గ్రామ కంఠం సర్కారు స్థలాలపై కన్నేస్తే కఠిన చర్యలు**
- **రూల్స్ బ్రేక్ చేస్తే బుల్డోజర్లు దిగుతాయి**
- **నాలా కన్వర్షన్ లేకపోతే కూల్చివేతలే**
- **వెంచర్ల నిర్వాహకులకు తాసిల్దార్ వార్నింగ్**

**అమీన్ పూర్ మే 18 సిరి న్యూస్**



అమీన్ పూర్ మండల పరిధిలోని గండిగూడ, సుల్తాన్పూర్, దయారా గ్రామాలల్లో సోమవారం తాసిల్దార్, సర్వేయర్ తో కలిసి విస్తృతంగా పర్యటన చేశారు. గ్రామకంఠం , మరియు ప్రభుత్వ భూములను కబ్జాలు చేస్తే సహించేది లేదని తహసిల్దార్ వెంకటేష్ హెచ్చరిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాళా పక్కన నిర్మాణాలు చేపడితే నాలా కన్వర్షన్ నిబంధన ప్రకారం, వ్యవసాయ భూములను కమర్షియల్ లేదా రెసిడె న్షియల్ వెంచర్లుగా మార్చాలంటే ప్రభుత్వ నిబంధనల ప్రకారం కచ్చితంగా నాలా కన్వర్షన్ చేసుకోవడం తప్పనిసరి అని ఆయన స్పష్టం చేశారు. కొనుగోలుదా రులకు సూచన ప్రజలు కూడా వెంచర్లలో ప్లాట్లు కొనే ముందు నాలా కన్వర్షన్, డిటిసిపి, హెచ్ఎండిఏ అనుమతులు ఉన్నాయో లేదో సరిచూసుకోవాలని అని అన్నారు.అక్రమ వెంచర్లను నమ్మి మోసపో వద్దని ఆయన సూచించారు.కూల్చివేతలకు హెచ్చరిక నాలా అనుమతులు లేకుండా నిబంధనలు బెకాతర్ చేస్తూ అక్రమంగా పనులు కొనసాగిస్తే ఆయా నిర్మాణాలను, లేఔట్లను పూర్తిగా కూల్చి వేయడానికి వెన కాడబోమని అందుకు రంగం సిద్ధం చేస్తున్నామని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రామాయంపేట లో భారీగా కాంగ్రెస్ పార్టీలో చేరిక లు..

- **BRS ,BJP పార్టీలకు షాక్....**
- **హనుమంతరావు, ఆంజనేయులు గౌడ్ ఆధ్వర్యంలో....**

**రామాయంపేట, మే 1 8( సిరి న్యూస్)**



తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మల్కాజ్గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ సమక్షంలో రామాయంపేట మున్సిపాలిటీ 7, వ వార్డుకు చెందిన పలువురు బిఆర్ఎస్, బిజెపి పార్టీలకు చెందిన కార్యకర్తలు,నాయకులు కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరారు. సోమవారం నాడు రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని 7 వ వార్డు బిఆర్ఎస్, బిజెపి పార్టీలకు చెందిన నాయకులు, ఆయా పార్టీలకు రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై మాజీ శాసనసభ్యులు మైనంపల్లి హనుమంతన్న సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. మైనంపల్లి హనుమంతరావు, మెదక్ జిల్లా డిసిసి అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ కాంగ్రెస్ పార్టీలో చేరిన వారందరికీ కండువా లు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సరాఫ్ యాదగిరి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రమేష్ రెడ్డి , రామయంపేట పట్టణ అధ్యక్షుడు చింతల స్వామి మండల అధ్యక్షుడు బండారు మహేందర్ రెడ్డి , కాంగ్రెస్ సీనియర్ నాయకులు డాకి స్వామి, చిలుక స్వామి , ఎనిశెట్టి అశోక్ , యాద నాగరాజు , మోబిన్ తో పాటు 7 వ వార్డు కౌన్సిలర్ గజవాడ లావణ్య నాగరాజు గుగులోతు రవి, దేవుని రంజిత్ కో ఆప్షన్ సభ్యులు దేమే యాదగిరి, డి సి సి ఉపాధ్యక్షులు చింతల యాదగిరి, డి సి సి కార్యదర్శి పోచమ్మల గణేష్ మరియు గొల్లిపర్తి సీనియర్ నాయకులు సత్యం , యాదగిరి ,పచ్చంటి రాము, పరశురాములు , నరేష్ తో పాటుగా యూత్ కాంగ్రెస్ నాయకులు చిలుక విరాట్. నరేష్,సుధీర్ గౌడ్,గణేష్, నరేందర్,సాయి తేజ,నితిన్ గౌడ్,సాయిల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి అర్జీలను పరిష్కరించాలి

- **ఫిర్యాదులను బాధ్యతగా స్వీకరించాలి**
- **బాధితులకు న్యాయం చేయాలి**
- **జిల్లా అడిషనల్ కలెక్టర్ సంగీత**

**సంగారెడ్డి, మే 18 (సిరి న్యూస్):**



ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చే దరఖా స్తులను త్వరితగతిన, నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ సంగీత ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆమె పాల్గొని, జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుండి నేరుగా వినతులను స్వీకరించారు. బాధితుల సమస్యలను అడిగి తెలుసుకున్న అడిషనల్ కలెక్టర్, వాటి పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికా రులకు అక్కడికక్కడే తగిన సూచనలు జారీ చేశారు. ఈ రోజు జిల్లావ్యాప్తంగా వివిధ డివిజన్ల పరిధిలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాల్లో మొత్తం 80 ఫిర్యాదులు అందినట్లు అధికారులు వెల్లడించారు. అందులో ప్రధానంగా కలెక్టరేట్‌కు 38, సంగారెడ్డి డివిజన్‌కు 12, ఆందోల్ డివిజన్‌కు 03, నారాయణఖేడ్ డివిజన్‌కు 19, మరియు జహీరాబాద్ డివిజన్‌కు 08 ఫిర్యాదులు అందినట్లు వివరించారు. ప్రతి ఫిర్యాదును బాధ్యతగా స్వీకరించి నిర్లక్ష్యానికి తావులేకుండా పనులు పూర్తి చేయాలని స్పష్టం చేసిన ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, రెవెన్యూ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు మరియు కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

# రైతులకు ఇబ్బందులు ఉండొద్దు

- **వాహనాల కొరత లేకుండా చూడాలి**
- **ఇతర రాష్ట్రాల ధాన్యం రాకుండా సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద నిఘా**
- **కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ పరితోష్ పంకజ్**
- **ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తనిఖీలు**

**సంగారెడ్డి, మే 18 (సిరి న్యూస్):**

కొండాపూర్ మండలం అలియాబాద్ మరియు కంది గ్రామాలలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ పరితోష్ పంకజ్ సోమవారం ఉమ్మడిగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు ప్రక్రియను అడిగి తెలుసుకున్న జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని చర్యలు తీసు కోవాలని అధికారులను ఆదేశించారు. రైతులకు పూర్తి అండగా నిలుస్తూ పోలీస్, రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో విధులు నిర్వహిం చాలని, శాంతిభద్రతల పరిరక్షణతో పాటు రైతుల ప్రయో జనాలను కాపాడాలని సూచించారు. అనంతరం జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ, కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బంది కలగకుండా పోలీస్ శాఖ తరఫున అవ సరమైన అన్ని భద్రతా ఏర్పాట్లు చేశామని, ధాన్యం తరలిం పునకు అవసరాన్ని బట్టి రవాణా వాహనాలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని స్పష్టం చేశారు. ఇతర రాష్ట్రాలకు చెందిన ధాన్యాన్ని అక్రమ మార్గాల్లో తీసుకువచ్చి తెలంగాణలో విక్రయించకుండా సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద కట్టుదిట్టమైన తనిఖీలు నిర్వహిస్తు న్నామని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఎస్పీ వెల్లడించారు.



# ప్రగతి ధర్మారంలో రైతుల రాస్తారోకో..

- **నెల రోజుల నుంచి ధాన్యం అలాగే ఉంటుంది..**
- **అధికారులు పట్టించుకోవడం లేదు**
- **ఎస్సై నచ్చ చెప్పడంతో రాస్తారోకో విరమణ.**

**రామాయంపేట, మే 18 (సిరి న్యూస్)**



హమాలీలు, లారీలు, గన్ని బ్యాగుల కొరత రైతులను తీవ్రంగా వేధిస్తుంది. నెల రోజులుగా ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఇబ్బంది పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మెదక్ జిల్లా రామాయంపేట మండలం ప్రగతి ధర్మారం గ్రామంలో రైతులు సోమవారం ధర్నా నిర్వహించారు. గ్రామంలో రెండు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన, గన్ని బ్యాగులు, లారీలు, హమాలీల కొరత వల్ల ధాన్యం ఎక్కడికి అక్కడ పేరుకుపో యిందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మెదక్– గజ్వేల్ ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టి నిరసన తెలిపారు. నెల రోజులుగా తాము ఇబ్బంది పడుతున్న అధికారులు ఎవరు పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న రామయంపేట ఎస్సై బాలరాజు ఘటన స్థలానికి చేరుకుని రైతులకు నచ్చచెప్పారు. లారీలు ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు.

# కబ్జా కోరల్లో ఎస్ఎన్ కుంట

- ఎఫ్టిఎల్ బఫర్ జోన్ లో అక్రమ ప్రహరి గోడ
- పైపులు వేసి చేతులు దులుపుకున్న అక్రమార్కులు
- అలుగుపై మట్టి పోసి రోడ్డు నిర్మాణం
- వరద కాలువను మింగేసిన రియల్ మాఫియా
- ఇరిగేషన్ అధికారుల జాడ ఎక్కడ!?





**జిన్నారం మే 18 సిరి న్యూస్**

జిన్నారం మండలం మాదారం గ్రామ ఎస్ఎన్ కుంట పూర్తిగా రోజు రోజుకు కబ్జాకు గురవుతుంది. కుంటలో ఏకంగా అక్రమంగా ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టి నెలలు గడుస్తున్న, అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు అంటూ, గ్రామస్తులు ముక్కున వేలేసుకుంటున్నారు.ఎస్ ఎన్ కుంట ఫుల్ ట్యాంక్ లెవెల్ నిండడంతో కింది చెరువుకు నీటిని సరఫరా చేసే ఫీడర్ నాలా సాగునీటి వ్యవస్థకు గుండెకాయ వంటిది. ఎస్ఎన్ కుంట అలుగు, కాలువ ద్వారా భామను చెరువులోకి నీరు ప్రవహిస్తుంది. చెరువు కింది భాగంలో ఉన్న రైతుల పంట పొలాలకు ఈ నాలా ద్వారా సాగునీరు అందుతుంది. ఫీడర్ ఛానల్ కనుమరుగు ఒకప్పుడు నీటి ప్రవాహంతో కలకలలాడే నాలా ఇప్పుడు కాస్త వాహనాలు తిరిగే రోడ్డుగా మారి తన ఉనికిని కోల్పోయింది. వర్షాకాలంలో కాలువ నిండినప్పుడు పైపుల గుండా నీరు వెళ్లకుండా చుట్టుపక్కల పొలాలు మునిగిపోయే ప్రమాదం ఏర్పడుతుందని గ్రామస్తులు వాపోతున్నారు. తక్షణమే ఈ సమస్యను ఉన్నత అధికారులు పట్టించుకోని ఎస్ ఎన్ కుంట లో వెలిసిన అక్రమ ప్రహారిని కూల్చి, నాలా, అలుగును పునరుద్ధరణ చేపట్టాలని వేడుకుంటున్నారు.

### ముఖ్యమంత్రి హెచ్చరికలు గాల్లోకేనా!?

రియల్ మాఫియా తో ఇరిగేషన్ అధికారుల లూటీ!?సీఎం రేవంత్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలు నాళాలు, అలుగులు, కాలువలు, చెరువుల ఎఫ్టిఎల్ మరియు బఫర్ జోన్లలో ఎలాంటి నిర్మాణాలు చేపట్ట వద్దని నిబంధనలు ఉల్లంఘిస్తే బుల్డోజర్ తో హైడ్రా అధికారులు కూల్చివేస్తారని స్పష్టంగా పదేపదే హెచ్చరిస్తున్నారు. నీటి వనరుల సంరక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో అక్రమార్కులు ఏమాత్రం భయం లేకుండా నాలాలపై రోడ్లు వేస్తూ నాలను, మరియు అలుగు కాలువలను పూడ్చి ఇష్ట రాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఇరిగేషన్ అధికారుల మౌనం కళ్ళముందే సహజ కాలువలు మాయమై పోతున్న చెరువు కుంటల్లో ఏకంగా కాంపౌండ్ వాల్ వెలుస్తున్న స్థానిక నీటిపారుదల శాఖ అధికారులు నిమ్మకు నేరెత్తినట్లు వ్యవహరిస్తుండడంపై తీవ్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

# ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి పెద్దపీట

- గుమ్మడిదల జడ్పీహెచ్ఎస్‌లో కోటి రూపాయలతో అదనపు గదుల నిర్మాణం
- ఎన్‌సీసీ సంస్థ సహకారంతో విద్యార్థులకు మెరుగైన వసతులు



**గుమ్మడిదల, మే 18 (సిరి న్యూస్ ):**

ప్రభుత్వ పాఠశాలలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి వసతులు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ తెలిపారు. గుమ్మడిదల మున్సిపల్ కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీ సంస్థ ఆర్థిక సహకారంతో సుమారు కోటి రూపాయల అంచనా వ్యయంతో నిర్మించనున్న అదనపు అంతస్తు గదుల నిర్మాణ పనులను సోమవారం ఆయన వార్డు కౌన్సిలర్లతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు మున్సిపాలిటీ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు. ప్రభుత్వ విద్యను మరింత బలోపేతం చేయడానికి మౌలిక వసతుల అభివృద్ధి అత్యంత అవసరమని పేర్కొన్నారు. పాఠశాలలో నానాటికీ పెరుగుతున్న విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అదనపు తరగతి గదుల అవసరం ఏర్పడిందని, ఈ నేపథ్యంలో ఎన్‌సీసీ సంస్థ ముందుకు వచ్చి కోటి రూపాయలతో నిర్మాణ పనులకు సహకరించడం అభినందనీయమన్నారు.నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని, ఎక్కడా లోపాలు తలెత్తకుండా అధికారులు పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. అలాగే నిర్దేశిత గడువులోనే పనులను పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్‌కు ఆదేశించారు. విద్యార్థులకు మెరుగైన తరగతి గదులు, సౌకర్యవంతమైన విద్యా వాతావరణం కల్పించడం ద్వారా ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రుల్లో మరింత నమ్మకం పెరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం చేపడుతున్న ప్రతి అభివృద్ధి కార్యక్రమానికి మున్సిపాలిటీ పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోవర్ధన్ రెడ్డి, వార్డు కౌన్సిలర్లు రమేష్, కుమార్ గౌడ్, చక్రపాణి, సంజీవరెడ్డి, కిషన్, కోఆప్షన్ సభ్యుడు ఫయాజ్, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, శేఖర్ రెడ్డి, మహేష్, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటికి తాగునీరు అందించడమే లక్ష్యం

- రెండో వార్డు, బొంతపల్లిలో నూతన బోరుబావి పనుల ప్రారంభం



**గుమ్మడిదల, మే 18( సిరి న్యూస్ ):**

గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలో ప్రజల తాగునీటి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించడమే తమ ప్రధాన లక్ష్యమని మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ తెలిపారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని రెండో వార్డు మరియు బొంతపల్లి గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని నూతన బోరుబావి పనులను ప్రారంభించారు. రెండో వార్డులో వార్డు కౌన్సిలర్ సారెడ్డిగారి పద్మ ఆధ్వర్యంలో బోరుబావి ఏర్పాటు పనులను చేపట్టగా, బొంతపల్లిలో అయ్యప్ప స్వామి దేవాలయం సమీపంలో స్థానిక వార్డు కౌన్సిలర్ల ఆధ్వర్యంలో బోరుబావి తవ్వకం పనులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా చైర్మన్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ వేసవి కాలంలో ప్రజలకు తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అవసరమైన ప్రాంతాల్లో కొత్త బోరుబావులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి వార్డులో మౌలిక వసతుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు. గ్రామంలోని ప్రతి ఇంటికి తాగునీరు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు ప్రజాప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ చిమ్ముల సంధ్యారెడ్డి, వార్డు కౌన్సిలర్లు గిద్దె విజయలక్ష్మి , రాజశేఖర్, రమేష్, కిషన్, చక్రపాణి, కుమార్ గౌడ్, జైపాల్ రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు ఫయాజ్, టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గోవర్ధన్ రెడ్డి, నాయకులు వెంకట్రాంరెడ్డి, సత్యనారాయణ, శ్రీనివాస్ రెడ్డి, శేఖర్ రెడ్డి, మహేష్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# బీఈమ్యాక్ సొసైటీకి ఇంప్రూవ్మెంట్ చార్జీలలో ఊరట కల్పించాలి

- జలమండలి ఎండీని కోరిన ఎమ్మెల్యే జీఎంఆర్
- ఉస్మాన్‌నగర్ కాలనీవాసుల సమస్యపై ప్రత్యేక చర్చ



**రామచంద్రాపురం, మే 18, (సిరి న్యూస్):**

తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఉస్మాన్‌నగర్ బీఈమ్యాక్ సొసైటీ కాలనీవాసులపై విధించిన ఇంప్రూవ్మెంట్ చార్జీలను తగ్గించి మంచినీటి కనెక్షన్లు మంజూరు చేయాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి జలమండలి ఎండీ అశోక్ రెడ్డిని కోరారు.సోమవారం హైదరాబాద్‌లోని జలమండలి కార్యాలయంలో ఎండీ అశోక్ రెడ్డితో ఎమ్మెల్యే జీఎంఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో కొనసాగుతున్న మంచినీటి సరఫరా, రిజర్వాయర్లు, కొత్త కనెక్షన్ల అంశాలపై చర్చించారు.ఉస్మాన్‌నగర్‌లోని బీఈమ్యాక్ సొసైటీలో ప్రధానంగా బీహెచ్ఈఎల్‌లో పనిచేసి పదవీ విరమణ పొందిన ఉద్యోగులు నివసిస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. ఇటీవల కాలనీవాసులు మంచినీటి కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకోగా, జలమండలి నుంచి భారీ మొత్తంలో చార్జీలు చెల్లించాలని నోటీసులు అందినట్లు వివరించారు. ఇప్పటికే సొసైటీ తరపున కోట్ల రూపాయలను జలమండలికి డీడీ రూపంలో చెల్లించినప్పటికీ, అదనంగా ఇంప్రూవ్మెంట్ చార్జీలు విధించడం రిటైర్డ్ ఉద్యోగులకు భారంగా మారిందన్నారు.కాలనీలో ఎక్కువ మంది వృద్ధులు, పదవీ విరమణ పొందిన కార్మికులే నివసిస్తున్నందున మానవతా దృక్పథంతో ఇంప్రూవ్మెంట్ చార్జీలను తగ్గించి నల్ల కనెక్షన్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.ఈ అంశంపై సానుకూలంగా స్పందించిన జలమండలి ఎండీ అశోక్ రెడ్డి త్వరలోనే తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.సమావేశంలో మాజీ ప్రజాప్రతినిధులు ఉమేష్, బీఈమ్యాక్ సొసైటీ అధ్యక్షుడు సంజీవ్ ప్రసాద్, ఉపాధ్యక్షుడు మాధవరావు, సంయుక్త కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, ప్రతినిధులు వాసుదేవరావు, సందీప్ రెడ్డి, సూర్య తదితరులు పాల్గొన్నారు.

# మురుగు నీటితో ముంచుకొస్తున్న జబ్బులు

**పేరుకే విల్లాలు పక్కన పెడితే డ్రైనేజీ రూల్స్**
**బయటకు వెదజల్లుతున్న సాయి కౌంటి విల్లాస్**
**సాయి కౌంటి మురుగుతో స్థానికులకునరకప్రాయం**



**జిన్నారం మే 18 సిరి న్యూస్**

గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని కాజిపల్లి సాయి కౌంటి విల్లాస్ నుండి యదేచ్చగా మురుగునీరు ప్రవహిస్తుంది.సాయి కౌంటి విల్లాస్ నివాసితులకు ఆర్కే ఫౌండేషన్ తరపున విజ్ఞప్తి చేశారు. మీ డ్రైనేజీ నీటిని పక్కవారి స్థలాల్లోకి వదలవద్దు, బహిరంగ డ్రైనేజ్ వలన ప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు అని తెలిపారు. డ్రైనేజీ వదలడంతో తీవ్ర దుర్వాసన వెదజల్లుతుంది. కాజిపల్లి గ్రామ పరిధిలోకి మురుగునీరు రావటంతో ముక్కుపూటలు అదిరిపోయే, ఘాటు వాసనలు వెదజల్లుతున్నాయి అని అన్నారు. నియమాలు గాల్లోకి సాయి కౌంటి విల్లాస్ నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా తమ విల్లాల నుండి వస్తున్న మురుగునీటిని బయటకు వెదజల్లుతున్నారు. మురుగు నీరు రోడ్లపైకి, కాలి స్థలాల్లోకి ప్రవహిస్తుండటంతో పరిసర ప్రాంతాలన్నీ తీవ్రమైన కాలుష్యం మాయంగా మారటమే కాకుండా విపరీతమైన దుర్వాసన వస్తుంది అని గ్రామస్తులు వాపోతున్నారు. తక్షణమే సాయి కౌంటి విల్లాస్ నుండి వదులుతున్న మురుగునీటినీ,తక్షణమే అడ్డుకట్ట వేయాలని నిబంధనలు ఉల్లగించిన విల్లాల నిర్వాహకులపై మున్సిపల్ అధికారులు కట్టిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుకుంటున్నారు.

# పర్యాటక హబ్‌గా ముస్తాబవుతున్న ముత్తంగి ఎంక చెరువు

**రూ.7.60 కోట్లతో అభివృద్ధి పనులు**
**త్వరలో ప్రజలకు అందుబాటులోకి: ఎమ్మెల్యే జీఎంఆర్**






**రామచంద్రపురం,(పటాన్ చెరు), మే 18, (సిరి న్యూస్):**

ముత్తంగి డివిజన్ పరిధిలోని ఎంక చెరువును ఆధునిక సౌకర్యాలతో పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. హెచ్ఎండిఏ ఆధ్వర్యంలో రూ.7 కోట్ల 60 లక్షల వ్యయంతో చేపడుతున్న సుందరీకరణ పనులు చివరి దశకు చేరుకున్నాయని చెప్పారు.సోమవారం ఉదయం హెచ్ఎండిఏ అధికారులతో కలిసి ఎమ్మెల్యే జీఎంఆర్ చెరువు అభివృద్ధి పనులను పరిశీలించారు. చెరువు కట్టపై ద్విచక్ర వాహనంలో తిరుగుతూ పనుల పురోగతిని సమీక్షించారు. అనంతరం మాట్లాడుతూ, సుమారు 60 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఎంక చెరువును ప్రజలకు ఆహ్లాదకరమైన విహార కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు.ప్రాజెక్టులో భాగంగా వాకింగ్ ట్రాక్, బతుకమ్మ ఘాట్, హైమాస్ట్ లైటింగ్, అలంకార దీపాలు, గార్డెనింగ్ తదితర సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. చెరువులో గుర్రపు డెక్క తొలగింపు, పూడికతీత పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం 80 శాతం పనులు పూర్తయ్యాయని, మరో రెండు నెలల్లో మొత్తం పనులు ముగించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నామని చెప్పారు.ఇస్నాపూర్ ప్రాంత ప్రజలు సులభంగా చేరుకునేందుకు చెరువు కట్టకు కనెక్టింగ్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. ముత్తంగితో పాటు ఇస్నాపూర్, పాశమైలారం, చిట్కుల్, లకడారం ప్రాంత ప్రజలకు ఈ చెరువు ప్రధాన ఆకర్షణగా మారుతుందని అన్నారు.అలాగే పటాన్‌చెరు పరిధిలోని సాకి చెరువు, తిమ్మక్క చెరువు, దోషం చెరువులను కూడా దశలవారీగా పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు.ఈ కార్యక్రమంలో హెచ్ఎండిఏ డీఈ రామారావు, మాజీ సర్పంచ్ ఉపేందర్, నాయకులు శ్రీనివాస్, కుమార్ గౌడ్, ప్రభాకర్, కిట్టు, శ్రీనివాస్ రెడ్డి, మేరాజ్ ఖాన్, రామకృష్ణ, అబేద్, రవి తదితరులు పాల్గొన్నారు.

# భౌతిక శాస్త్రంలో రవి వర్మకు పీహెచ్‌డీ

**రామచంద్రపురం,(పటాన్చెరు), మే 18, (సిరి న్యూస్):**



హైదరాబాద్‌కు చెందిన గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ భౌతిక శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి ఐ.ఎస్. రవి వర్మ పీహెచ్‌డీ పట్టాకు అర్హత సాధించారు. "నానో కాంపోజిట్ పాలిమర్ బ్లెండ్ ఎలక్ట్రోలైట్లలో సోడియం అయాన్ ప్రసరణ యంత్రాంగం"పై ఆయన పరిశోధన చేశారు.ఈ పరిశోధనలో శక్తి నిల్వ సాంకేతికతలకు ఉపయోగపడే అధునాతన పాలిమర్ ఎలక్ట్రోలైట్ ఫిల్మ్‌ల అభివృద్ధిపై దృష్టి సారించినట్టు గీతం భౌతిక శాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్. రమేష్ తెలిపారు.రవి వర్మ సాధించిన విజయంపై గీతం యాజమాన్యం, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

# వ్యాయామాలతోనే శారీరక దృఢత్వం

- ప్రతిభావంతులైన క్రీడాకారులకు పెట్టింది పేరు మెదక్ జిల్లా
- మానసిక ప్రశాంతత, ఆరోగ్యం,ఓర్పు, సహనం పెంపు*
- 18 నుండి 23 వరకు యువజన క్రీడా, పర్యాటక వారోత్సవాలు

**జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.**

**మెదక్ మే,18(సిరిన్యూస్)**



వ్యాయామాలతో ఆరోగ్యం, శారీరకంగా దృఢత్వంతో పాటు మానసిక స్థైర్యం పెంపొందుతాయని జిల్లా కలెక్టర్ ప్రతిమసింగ్ పేర్కొన్నారు. సోమవారం 99 రోజుల ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా... యువజన, క్రీడల మరియు పర్యాటక వారోత్సవాల సందర్భంగా.జిల్లా యువజన,క్రీడా శాఖ ఆధ్వర్యంలో మెదక్ పోస్ట్ ఆఫీస్ సర్కిల్ నుండి ధ్యాన్చంద్ స్టేడియం వరకు నిర్వహించిన 5కే రన్ లో పాల్గొన్నారు.అదనపు కలెక్టర్ నగేష్, మున్సిపల్ చైర్మన్ రాధిక భూపతి రాజు, జిల్లా యువజన క్రీడల నిర్వహణ అధికారి రమేష్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి,.జిల్లా పరిశ్రమల అధికారి ప్రకాష్ రావు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు క్రీడాభిమానులు,తో కలిసి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్రీడలను ప్రోత్సహించడానికి, పర్యాటక రంగాన్ని బలోపేతం చేయడానికి మరియు స్థానిక పర్యాటక ప్రాంతాలను ప్రోత్సహించడానికి క్రీడా మరియు పర్యాటక వారోత్సవాలను జిల్లా మండల స్థాయిలలో ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. మెదక్ జిల్లాలో చూడ చక్కని పర్యాటక ప్రాంతాలకు నెలవుగా. టూరిజం స్పాట్ గా ఉందన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రజల సహకారంతో జిల్లా పాలనను సమర్థవంతంగా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.ముఖ్యంగా యువత దైనందిక జీవితంలో మానసిక, శారీరక, ఆరోగ్యానికి, పరిరక్షణకై అందరు పాటుపడాలని పిలుపునిచ్చారు.ప్రతీ రోజూ వాకింగ్, రన్నింగ్ ప్రక్రియ.మన శారీరక ఓర్పును,పరీక్షించే ఒక గొప్ప క్రీడాంశామని సూచించారు.ఈ కార్యక్రమంలో యువజన క్రీడల నిర్వహణ అధికారి రమేష్, జిల్లా పరిశ్రమల అధికారి ప్రకాష్ రావు, సైన్స్ అధికారి రాజిరెడ్డి,జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు శ్రీనివాస్ రావు, ప్రధాన కార్యదర్శి మధు సూదన్, వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, క్రీడా సంఘాల నాయకులు, వ్యాయామ ఉపాధ్యాయులు మాధవరెడ్డి, చంద్రమోహన్, వినోద్, మనోహర్, దేవేందర్ రెడ్డి. యన్.సి.సి. క్యాడెట్స్, క్రీడాకారులు యువకులు సుమారు 300 లకు పైగా పాల్గొన్నారు.



# పట్టపగలే వెలుగుతున్న వీధిదీపాలు

- విద్యుత్ వృథాపై గ్రామస్తుల ఆందోళన
- వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులకు విజ్ఞప్తి

**గుమ్మడిదల, మే 18 (సిరి న్యూస్):**

గుమ్మడిదల మండల పరిధిలోని నల్లవల్లి గ్రామపంచాయతీలో వీధిదీపాలు పట్టపగలే వెలుగుతూ విద్యుత్ వృథాకు కారణమవుతున్నాయి. గ్రామపంచాయతీ పరిధిలోని పలు వీధుల్లో గత కొన్ని రోజులుగా ఉదయం, మధ్యాహ్నం సమయాల్లో కూడా వీధి దీపాలు ఆపకుండా వెలుగుతుండటంతో గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.రాత్రి సమయంలో ప్రజల భద్రత కోసం ఏర్పాటు చేసిన వీధిదీపాలు పగటి వేళల్లో కూడా నిరంతరం వెలుగుతుండటంతో ప్రభుత్వ విద్యుత్ వినియోగం అనవసరంగా పెరుగుతోందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. గ్రామంలో ప్రతిరోజూ అందరి కళ్ల ముందే ఈ పరిస్థితి కనిపిస్తున్నప్పటికీ, సంబంధిత అధికారులు మరియు ప్రజాప్రతినిధులు స్పందించకపోవడంపై ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వేసవి కాలంలో విద్యుత్ వినియోగం అధికంగా ఉన్న నేపథ్యంలో ఇలాంటి నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వంపై అదనపు భారం పడుతోందని గ్రామ పెద్దలు అంటున్నారు. చిన్న సమస్యగా కనిపించినా దీర్ఘకాలంలో ఇది పెద్ద ఎత్తున విద్యుత్ వృథాకు దారితీసే అవకాశముందని అభిప్రాయపడుతున్నారు. గ్రామపంచాయతీ అధికారులు వెంటనే స్పందించి వీధిదీపాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని గ్రామస్తులు కోరుతున్నారు. అవసరమైతే ఆటోమేటిక్ టైమర్ వ్యవస్థలు ఏర్పాటు చేసి రాత్రి సమయంలో మాత్రమే వీధిదీపాలు వెలిగేలా చర్యలు చేపట్టాలని సూచిస్తున్నారు. అలాగే విద్యుత్ ఆదా విషయంలో గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి సిబ్బందికి స్పష్టమైన బాధ్యతలు అప్పగించాలని కోరుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సమస్యను గుర్తించి తక్షణ చర్యలు తీసుకుని పట్టపగలే వెలుగుతున్న వీధిదీపాలను నియంత్రిస్తే విద్యుత్ వృథా తగ్గడంతో పాటు ప్రభుత్వానికి ఆర్థిక భారం కూడా తగ్గే అవకాశం ఉందని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు.




# జిల్లా ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి

- మాజీ డిప్యూటీ స్పీకర్ యం.పద్మ దేవేందర్ రెడ్డి.

**మెదక్ మే,18(సిరిన్యూస్)**





మెదక్ మండల పరిధిలోని మక్తభూపతిపూర్ గ్రామంలో సోమవారం శ్రీనల్ల పోచమ్మ జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.ఈ జాతర ఉత్సవాలలో మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మ దేవేందర్ రెడ్డి పాల్గొని మహిళలతో కలిసి బోనం ఎత్తుకున్నారు. అనంతరం నల్ల పోచమ్మ తల్లిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలకు జాతరలు ప్రతీకలని అన్నారు.నల్ల పోచమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. గ్రామాల్లో ఐక్యత, సోదరభావం పెంపొందించడంలో జాతర ఉత్సవాలు ముఖ్యపాత్ర పోషిస్తాయని తెలిపారు. ప్రజలు ఆనందోత్సాహాల మధ్య జాతరను జరుపుకోవడం సంతోషకరమన్నారు. రైతులకు మంచి వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని,ప్రతి కుటుంబం సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా గ్రామ జాతర కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు పద్మ దేవేందర్ రెడ్డికి మెమొంటో అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో మెదక్ మాజీ జడ్పీ వైస్ చైర్మన్ లావణ్య రెడ్డి, మెదక్ మండల పార్టీ అధ్యక్షుడు ఎం. అంజగౌడ్, మాజీ ఎంపీపీ కిష్టయ్య,, గ్రామ పార్టీ అధ్యక్షుడు సత్య గౌడ్, గ్రామ ఉప సర్పంచ్ బండామీది దుర్గయ్య, మాజీ సర్పంచ్ గట్టయ్య, మాజీ ఎంపీటీసీ ప్రభాకర్, మాజీ సర్పంచ్ అశోక్, ముష్టి పెద్ద గంగయ్య,, రాజల్ పేట గట్టయ్య మంగలి ఆంజనేయులు, శాకానోళ్ల అంజయ్య,,శ్రీధర్ రెడ్డి,,మెదక్ మండల సోషల్ మీడియా ఇన్‌చార్జ్ ఎంబిపూర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# తాసిల్దార్ కు మెమొరండం సమర్పిస్తున్న మెడికల్ అసోసియేషన్

**కొల్చారం మే 18 (సిరి న్యూస్ )**


దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న మెడికల్ డ్రాగెస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెడికల్ షాప్ లో బంద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయా మెడికల్ షాప్ లో యజమానులు బంద్కు పిలుపునిచ్చారు సోమవారం నాడు కొల్చారం తాసిల్దార్ కు స్థానిక ఎస్సైకి మెమోరాండం సమర్పించారుఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు & కొల్చారం. కౌడిపల్లి. చిలిప్ చేడ్ ఏరియా ప్రధాన కార్యదర్శి ఆరుగొండ అశోక్ కుమార్. ఏరియా అధ్యక్షులు పొన్నం మనోహర్ గౌడ్. ఏరియా అసోసియేషన్ కోశాధికారి మాలి వెంకన్న. జిల్లా ఈసీ మెంబర్ కాలేరు శ్రీనివాస్. గోకుని రాజా గౌడ్. సందీప్. రెడ్యా .మరియు ఏరియా అసోసియేషన్ నాయకులు నర్సింహారెడ్డి. ప్రభాకర్. ప్రశాంత్. శంకర్ గౌడ్. అనిల్ గౌడ్ ప్రేమ్. కుమార్ రహీం యూసుఫ్. హరీష్ గౌడ్. తదితరులు పాల్గొన్నారు



# వెల్దుర్తి లో అనుమాదస్పద లైంగిక దాడి ?




**వెల్దుర్తి, మే 18 :(సిరి న్యూస్):**



వెల్దుర్తి మండలంలోని కుకునూరు గ్రామానికి చెందిన ఓ మహిళపై లైంగిక దాడి జరిగినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు ప్రకారం బాధితురాలు తన కుమారుడుతో కలిసి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఇంట్లో అద్దెకుంటుంది. ఈనెల 17న మధ్యాహ్నం సమయంలో ఇంటి యజమాని తన ఐదుగురు స్నేహితులతో కలిసి ఇంటికి వచ్చి కోడి మాంసం వండించుకొని మద్యం సేవించినట్లు తెలిపింది. అనంతరం తాను మత్తులో స్పృహ కోల్పోయినట్లు పేర్కొంది. సాయంత్రం సమయంలో తన కుమారుడు ఇంటికి వచ్చి నిద్రలేపగా, తన దుస్తులు సరిగా లేకుండా ఉండటాన్ని గమనించినట్లు తెలిపింది. తాను స్పృహలో లేని సమయంలో సదరు వ్యక్తి అతని స్నేహితులు తనపై లైంగిక దాడి చేయడానికి ప్రయత్నించి ఉండొచ్చని బాధితురాలు అనుమానం వ్యక్తం చేసింది. ఈ మేరకు ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# వరిగుంతం లో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

## మండల వ్యవసాయ అధికారి శ్వేత కుమారి



**కొల్చారం, మే 18,(సిరి న్యూస్)**

కొల్చారం మండలంలోని వరిగుంతం గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేతలు ప్రోగ్రామ్ నిర్వహించడం జరిగిందనీ మండల వ్యవసాయ అధికారి శ్వేత కుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేతలు పలు అంశాలను గురించి చర్చించారు. ప్రకృతి వ్యవసాయం, వరి కోయలను కాల్చడం వలన జరిగే నష్టం,వరి పంటలో వచ్చే చీడ పీడ గురించి, మార్కెట్ ప్రేఫరెడ్ గురించి, సమతుల్య ఎరువుల వినియాగం, మట్టి నమూనా సేకరణ గురించి వివరించడం జరిగింది, ఈ కార్యక్రమంలో వ్యవసాయ యూనివర్సిటీ సైంటిస్ట్ డాక్టర్. పి. సతీష్ , డాక్టర్. సిహెచ్ రమ్యశ్రీ, సర్పంచ్ పుట్లగల్ల మోహన్, ఉపసర్పంచ్ బాంచ వీరేశం, వార్డు సభ్యులు అరిగే రమేష్ , బోడ దాస్ , సొసైటీ చైర్మన్ చిన్నారపు ప్రభాకర్, గ్రామ పెద్దలు నహీం, తిమ్మయ్య గారి శ్రీహరి గౌడ్, అచ్చన్నపల్లి దుర్గయ్య, గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీదేవి,వ్యవసాయ విస్తరణ అధికారి రైతులు పాల్గొన్నారు.

# అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రజలకు త్రాగు నీటి ఇబ్బందులు

## సిపిఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలభిందెల శ్రీనివాస్.

**కుత్బుల్లాపూర్ (సిరి న్యూస్):**

మున్సిపల్ అధికారులు, వాటర్ డిపార్ట్మెంట్ వల్ల సమన్వయ లోపం వల్ల నీళ్లు రాక సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సిపిఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలభిందెల శ్రీనివాస్ అన్నారు. నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప పోచమ్మ దేవాలయం వద్ద అధికారులు, కాంట్రాక్ట్ నిర్లక్ష్యం వల్ల ప్రజలు తాగే మంచి నీళ్ల పైపుకు రంధ్రం పడడం వల్ల మున్సిపల్, వాటర్ డిపార్ట్మెంట్ అధికారుల సమన్వయం లోపం వల్ల నీటి సరఫరా ఆగిపోయింది. ఈ సమాన్వయం లోపని నిరసిస్తూ సిపిఐ ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. అనంతరం సిపిఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలభిందెల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలకు నీళ్లు అధించవలసిన వాటర్ డిపార్ట్మెంట్ అధికారులు, రోడ్డులు ఇతర సౌకర్యాలు సమాకూర్చే మున్సిపల్ అధికారుల సమన్వయ లోపం వల్ల సామాన్య ప్రజలు ఇబ్బందులకు గురి అవుతున్నారు అని గుర్తు చేశారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల ఒక రోజు నీళ్లు రాకపోతే నెల బిల్లులో ఒక రోజు బిల్ కట్ చేసి ఇస్తారా అని ప్రశ్నించారు. కనుక నిర్లక్ష్యం వహించిన కాంట్రాక్ట్ లైసెన్సు వెంటనే రద్దు చేయాలనీ వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు పొన్నకంటి దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ క్రష్ రష్మిక మందన్నా కుడిచేతి మణికట్టుపై ఉన్న 'ఇర్రీప్లేసబుల్' టాటూ గురించి సోషల్ మీడియాలో నిరంతరం వైరల్ అవుతూనే ఉంటుంది. ఇది విజయ్ దేవరకొండ కోసమే వేయించుకుందా? అంటూ బాలీవుడ్, టాలీవుడ్ మీడియా సర్కిల్స్ ఎప్పుడూ దీనికి లవ్ యాంగిల్ జోడిస్తూ గాసిప్స్ క్రియేట్ చేస్తుంటాయి. అయితే, దీని వెనుక ఉన్న అసలు నిజాన్ని, ఒక క్రేజీ ఫ్లాష్‌బ్యాక్‌ను రష్మిక స్వయంగా ఇంటర్వ్యూ లో స్పష్టం చేశారు. రష్మిక మాట్లాడుతూ.. 'నిజం చెప్పాలంటే మొదట నాకు టాటూ వేయించుకోవాలనే ఐడియా అస్సలు లేదు. కానీ నేను కాలేజీలో ఉన్నప్పుడు ఒక అబ్బాయి నా దగ్గరకు వచ్చి.. 'ఆడపిల్లలు అసలు పెయిన్ (బాధను) భరించలేరు. వాళ్లకు సూదులు అన్నా, ఇంజెక్షన్లు అన్నా చాలా భయం' అంటూ కామెంట్ చేశాడు. అప్పుడు ఆడవాళ్లు దేనికైనా సిద్ధమే అని నిరూపించడం కోసం, వాడికి చూపించడం కోసమే ఎలాగైనా టాటూ వేయించుకోవాలని ఫిక్స్ అయ్యాను. కాపీ చేతిపై ఏం రాయించుకోవాలా అని చాలా సేపు ఆలోచించా.. నేను ఎప్పుడూ నా లైఫ్‌లో చాలా రియల్‌గా, నా లాగే ఉండాలనుకుంటాను. ఈ ప్రపంచంలో ఏ ఒక్క మనిషిని, మరొకరు భర్తీ చేయలేరని నేను బలంగా నమ్ముతాను. మనందరం మనదైన శైలిలో 'ఇర్రీప్లేసబుల్'. ఆ విషయాన్ని నాకు నేను ఎప్పుడూ గుర్తుచేసుకోవడానికి, అలాగే నా ప్రొఫెషనల్ అండ్ పర్సనల్ లైఫ్‌లో ఒక గోల్ లాగా పెట్టుకోవడానికి ఈ పదాన్ని టాటూగా వేయించుకున్నాను' అని రష్మిక క్లారిటీ ఇచ్చారు. కాబట్టి సోషల్ మీడియా పేజీలు అనుకుంటున్నట్లు ఈ టాటూకు హీరో విజయ్ దేవరకొండకు ఎలాంటి సంబంధం లేదని, ఇది ఆమె సెల్ఫ్-మోటివేషనల్ టాటూ అని స్పష్టమైంది.



# విజయ్ దేవరకొండ కోసం కాదు..

# చదువుకోవడం కోసం సినిమాలకు బ్రేక్

టాలీవుడ్ మోస్ట్ హ్యాపెనింగ్ బ్యూటీ, సెన్సేషనల్ హీరోయిన్ శ్రీలీలప్రస్తుతం తెలుగులో సినిమాలు చేయడం లేదు. ఆ మధ్య బాలీవుడ్ సినిమాల కోసమా టాలీవుడ్ ను పక్కన పెట్టిన శ్రీలీల అక్కడ బిజీ అవుతుందని అనుకున్నారు. కాని అక్కడ కూడా ప్రస్తుతం సినిమాలేవి చేయడం లేదు. ఇంతకీ మ్యాటరెంటని ఆరా తీయగా శ్రీలీల సినిమాలేవీ చేయడం లేదట. సినిమాలకు సడెన్ బ్రేక్ ఇచ్చిందట. ఒకప్పుడు చేతినిండా సినిమాలతో రోజుకు రెండు కాల్షీట్లు ఇస్తూ క్షణం తీరిక లేకుండా గడిపిన ఈ ముద్దుగుమ్మ.. ఇప్పుడు వెండితెరకు కాస్త దూరంగా ఉండటం ట్రేడ్ వర్గాల్లో మరియు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. అయితే ఆమెకు సినిమా ఆఫర్లు రాక ఖాళీగా ఉందా అంటే.. అస్సలు కాదు! కావాలనే ఆమె సినిమాలకు విరామం ప్రకటించినట్లు తెలిసింది.

వరుస సక్సెస్‌లతో టాలీవుడ్‌లో టాప్ స్పీడ్‌లో దూసుకుపోతున్న శ్రీలీల ఇలా గ్యాప్ తీసుకోవడం వెనుక ఒక బలమైన కారణం ఉంది. ఆమెకు అవకాశాలు తగ్గడం వల్ల ఈ గ్యాప్ రాలేదని శ్రీలీల తన చదువుపై దృష్టి పెట్టడం కోసమే ఈ విరామం తీసుకుందట. డాక్టర్ కోర్స్ చదువుతున్న శ్రీలీల అప్పట్లో గుంటూరు కారం సినిమా కోసం ఎగ్జామ్స్ కూడా పోస్ట్ పోన్ చేసుకుంది. కానీ ఇప్పుడు ప్రొఫెషనల్ యాక్టర్‌గా ఎంత బిజీగా ఉన్నప్పటికీ తన ఎడ్యుకేషన్‌ను పూర్తి చేయాలనే లక్ష్యంతోనే ఆమె సినిమాలను కాస్త పక్కన పెట్టినట్లు తెలుస్తోంది. చదువు పూర్తయిన తర్వాత మళ్లీ సరికొత్త ప్రాజెక్ట్‌లతో ఆమె వెండితెరపై రీ ఎంట్రీ ఇవ్వనుంది.



# చిరంజీవి కొత్త చిత్రం.. ముహూర్తం కుదిరింది



ఈ సంక్రాంతికి 'మన శంకరవరప్రసాద్‌గారు' సినిమాతో విజయాన్ని అందుకున్నారు కథానాయకుడు చిరంజీవి. ఇప్పుడే జోష్‌లోనే కొత్త చిత్రం కోసం రంగంలోకి దిగేందుకు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం ఆయన చేయనున్న ఈ 158వ సినిమాకి బాబీ దర్శకత్వం వహించనున్న సంగతి తెలిసిందే. 'వాల్తేరు వీరయ్య' విజయం తర్వాత వీళ్లిద్దరి కలయికలో రూపొందనున్న రెండో చిత్రమిది. కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై వెంకట్ కె.నారాయణ నిర్మిస్తున్నారు. ఇప్పటికే అధికారికంగా ప్రకటించిన ఈ సినిమా.. ఈ నెల 21న పూజా కార్యక్రమాలతో ప్రారంభం కానుంది. ఈ విషయాన్ని చిరు ఆదివారం సామాజిక మాధ్యమాల ద్వారా ప్రకటించారు. ఈ మేరకు ఓ వీడియోను అభిమానులతో పంచుకున్నారు. ఈ సినిమాలోని కొత్త లుక్ కోసం ఆయన పడుతున్న కష్టాన్ని.. శరీరాకృతిని మార్చుకునేందుకు చేస్తున్న కఠిన కసరత్తుల్ని ఆ వీడియోలో చూపించారు. మాస్ అంశాలతో నిండిన శక్తిమంతమైన యాక్షన్ కథతో ఈ సినిమా ముస్తాబు కానుంది. చిరు ఇందులో రెండు కోణాల్లో సాగే పాత్రలో అలరించనున్నట్లు తెలుస్తోంది. ఈ నెలాఖరు నుంచే రెగ్యులర్ షూట్ మొదలవుతుందని తెలిసింది. ఈ చిత్రం వచ్చే ఏడాది సంక్రాంతికి తెరపైకి వచ్చే అవకాశముంది.




# థియేటర్లు దద్దరిల్లడం ఖాయం.. 'పెద్ది' ట్రైలర్ వచ్చేసింది

ప్రస్తుతం టాలీవుడ్‌లో మోస్ట్ అవైటెడ్ మూవీగా మారిపోయిన 'పెద్ది' మూవీకి సంబంధించిన ట్రైలర్ తాజాగా రిలీజ్ అయింది. ఈ ట్రైలర్ కట్ ఏకంగా మూడు నిమిషాల ఏడు సెకండ్ల పాటు సాగింది. ఇందులో రామ్ చరణ్ క్యారెక్టర్‌ను పూర్తిగా రివీల్ చేయకుండా, అతని క్యారెక్టర్ మీద మరింత అంచనాలతో పాటు ఆసక్తి రేకెత్తించే ప్రయత్నం చేశారు. బొమన్ ఇరానీ క్యారెక్టర్, "ఇక్కడ ఉన్న ప్రతి కుర్రాడికి ఫేవరెట్ గేమ్ మారుతుందేమో కానీ, ఫేవరెట్ ప్లేయర్ మాత్రం పెద్ది అవుతున్నాడు. అతనేమైనా దేవుడా అంటే.. అతను గుళ్లో దేవుడు కాదు, గ్రౌండ్‌లో దేవుడు" అంటూ ఈ సినిమాకి స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్ ఎంత ముఖ్యమో చెప్పేలా ఒక డైలాగ్ ఉంది. తర్వాత "ఆటే నా పొగరు" అంటూ రాంచరణ్ చెబుతున్న డైలాగ్ మరింత ఆసక్తి పెంచేలా ఉండగా, జాన్వీ కపూర్ క్యారెక్టరైజేషన్ కూడా కొంచెం అనుమానాలు రేకెత్తించేలా ఉంది.

ఎందుకంటే, ఆమె పాత్ర ఎమ్మెల్యే కుమార్తె పాత్ర అని చెప్పారు కానీ, ట్రైలర్ కట్ మాత్రం అందుకు భిన్నంగా అనిపిస్తోంది. మరోపక్క అప్పలసూరిగా జగపతిబాబుని కూడా రెండు షాట్స్‌లో చూపించి, ఇది వేరే ఇష్యూ ఏదో కూడా డీల్ చేయబోతున్నట్లు క్లారిటీ ఇచ్చారు. మరో పక్క దివ్యాందు శర్మ "ఆట కూలి నా కొడుకు" అంటూ రాంచరణ్ పాత్రను మెన్షన్ చేస్తూ చెప్పిన డైలాగ్స్‌తో పాటు, రామ్ చరణ్ అండ్ టీం ఆట వస్తువులతో పాటు కొండలు, గుట్టలు దాటి వెళుతున్నట్లు కనిపిస్తున్న షాట్స్ సినిమా మీద ఆసక్తి రేకెత్తిస్తున్నాయి. క్రికెట్‌తో పాటు కుస్తీ, అలాగే రన్నింగ్ కూడా ఈ సినిమాలో కనిపించబోతోందని ట్రైలర్‌తో హింట్ ఇచ్చారు. ట్రైలర్‌తో అసలు కథ రివీల్ చేస్తారని ప్రచారం జరిగింది కానీ, కథ పూర్తిగా రివీల్ కాకుండానే సినిమా మీద ఆసక్తి పెంచే ప్రయత్నం చేశారు మేకర్స్.



మడాక్ హారర్ కామెడీ యూనివర్స్ ఫ్రాంచైజీ భాగంలో రాబోతున్న తదుపరి చిత్రం 'శక్తి శాలిని'. 'సైయారా' సినిమా విజయంతో బాలీవుడ్‌లో మంచి క్రేజ్‌ని సొంతం చేసుకున్న కథానాయిక అనీత్ పడ్డా ఇందులో ప్రధాన పాత్రలో నటిస్తుంది. ఈ చిత్రానికి ఆదిత్య సర్పోత్దార్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాని వచ్చే ఏడాది జనవరిలో థియేటర్లలో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని ప్రణాళిక చేస్తోందట చిత్రబృందం. ఈ సినిమా చివరి షెడ్యూల్ చిత్రీకరణ ముగింపు దశలో ఉందని.. ఆ వెంటనే పోస్ట్ ప్రొడక్షన్ పనులు ప్రారంభించనుందని తెలిసింది. అనీత్ పడ్డా ఈ చిత్రంలో ద్విపాత్రాభినయంలో కనిపించనుందని సమాచారం. మంచి, చెడుల మధ్య జరిగే శాశ్వత పోరాటం చుట్టూ ఈ చిత్రం తిరుగుతుందని జోరుగా ప్రచారం జరుగుతుంది. ఈ ఫ్రాంచైజీని మునుపటి కంటే గాఢమైన కథాంశంతో ముందుకు తీసుకెళ్లాలనే లక్ష్యంతో ఈ చిత్రాన్ని తీర్చిదిద్దుతున్నారట.

# వచ్చే ఏడాది శక్తిశాలిని?



# స్కూల్ పిల్లల కోసం..సల్మాన్ రూ.15 కోట్ల విరాళం..

బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్ గురించి ఎంత చెప్పుకున్న తక్కువే అవుతుంది. స్క్రీన్‌పై ఆయన ఎంత రఫ్‌గా, పవర్‌ఫుల్‌గా కనిపిస్తారో.. నిజ జీవితంలో మాత్రం చాలా సాఫ్ట్ హార్టెడ్ గా ఉంటారు. ఇందులో భాగంగా బీయింగ్ హ్యూమన్ ఫౌండేషన్ ద్వారా నిరంతరం ఎంతోమంది నిరుపేదలకు, చిన్నారులకు సహాయం చేసే సల్మాన్.. తాజాగా ఒక స్కూల్ పిల్లల కోసం చేసిన భారీ విరాళం, దానికి బదులుగా ఆ పిల్లలు ఇచ్చిన గిఫ్ట్ చూసి ఎమోషనల్ అయిన తీరు నెట్టింట వైరల్ అవుతోంది.

వెనుకబడిన ప్రాంతానికి చెందిన కొందరు పాఠశాల విద్యార్థుల చదువు కోసం సల్మాన్ ఖాన్ ఏకంగా రూ.15 కోట్ల రూపాయల భారీ ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సాయంతో ఆ స్కూల్‌లో మౌలిక వసతులు, డిజిటల్ క్లాస్‌రూమ్‌లు ఏర్పాటు కానున్నాయి. ఈ నేపథ్యంలో సల్మాన్‌ను కలిసి ధన్యవాదాలు చెప్పేందుకు వచ్చిన చిన్నారులు ఆయనకు ఒక సర్ప్రైజ్ ఇచ్చారు. స్వయంగా చేతులతో తయారు చేసిన ఒక అందమైన గిఫ్ట్ సల్మాన్ ఖాన్‌కు బహుమతిగా అందించారు.

కోట్లాది రూపాయల విలువైన బహుమతులను సైతం సాధారణంగా తీసుకునే భాయ్‌జాన్.. ఆ చిన్నారులు ఎంతో అమాయకంగా, ప్యూర్ లవ్‌తో ఇచ్చిన ఆ చిన్న కానుకను చూసి ఒక్కసారిగా భావోద్వేగానికి లోనయ్యారు. ఆ గిఫ్ట్‌ను గుండెలకు హత్తుకుని, కళ్లల్లో నీళ్లు తిరుగుతుండగా పిల్లలను గట్టిగా కౌగిలించుకున్నారు. సల్మాన్ ఖాన్ లాంటి ఒక మాస్ యాక్షన్ సూపర్‌స్టార్ పిల్లల నిస్వార్థమైన ప్రేమకు కరిగిపోయి ఏడ్చేసిన ఈ విజువల్స్ సోషల్ మీడియాలో అభిమానుల మనసులను గెలుచుకుంటున్నాయి. "భాయ్‌జాన్ రియల్ హీరో" అంటూ ఫ్యాన్స్ ఈ పోస్ట్‌ను విపరీతంగా ట్రెండ్ చేస్తున్నారు.

# మనోజ్ 'డేవిడ్ రెడ్డి'లో మరో యంగ్ హీరో.. క్లైమాక్స్ మొత్తం అతని చుట్టూనే

టాలీవుడ్ నటుడు మంచు మనోజ్ ప్రస్తుతం 'డేవిడ్ రెడ్డి' చిత్రంలో హీరోగా నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమాకు సంబంధించిన టీజర్‌ను ఆయన పుట్టినరోజు సందర్భంగా మే 20న విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం ఇప్పటికే అధికారికంగా ప్రకటించింది. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన మరో ఆసక్తికర వార్త టాలీవుడ్ వర్గాల్లో వైరల్‌గా మారింది. ఈ సినిమాలో మంచు మనోజ్‌తో పాటు మరో యువ హీరో కూడా కీలక పాత్రలో కనిపించబోతున్నట్లు సమాచారం. పాత్ర నిడివి తక్కువగానే ఉన్నప్పటికీ, కథలో అది ఎంతో ప్రాధాన్యత కలిగి ఉండనున్నట్లు టాక్ వినిపిస్తోంది. ముఖ్యంగా సినిమా క్లైమాక్స్‌లో వచ్చే యాక్షన్ సన్నివేశాలు ఆ యువ హీరో పాత్ర చుట్టూనే తిరగనున్నట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

దీంతో ఆ పాత్రలో ఎవరు కనిపించబోతున్నారు అనే అంశంపై ఆసక్తి నెలకొంది. ప్రస్తుతం 'డేవిడ్ రెడ్డి' చిత్రంపై ప్రేక్షకుల్లో మంచి అంచనాలు ఉన్నాయి. సోలో హీరోగా మంచు మనోజ్‌కు హిట్ వచ్చి చాలా కాలం కావడంతో, ఈ సినిమాతో ఆయన మళ్లీ సక్సెస్ ట్రాక్‌లోకి వస్తారా అనే ఆసక్తి జనాల్లో కనిపిస్తోంది. హనుమా రెడ్డి యక్కంటి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో మరియా ర్యాబోషప్క హీరోయిన్‌గా నటిస్తోంది. వెల్వెట్ సోల్ మోషన్ పిక్చర్స్, ట్రూ రాడిక్స్ బ్యానర్లపై భరత్ మోతుకూరి, వెంకట్ రెడ్డి నల్లాగంగుల నిర్మిస్తున్న ఈ సినిమాకు రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు.



The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY editor BADHE JAYASHREE.